## 27న నంగునూర్‌లో బిఆర్‌ఎస్ మహాధర్నా

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి :** రైతుల సమస్యలపై పోరాట చేసేందుకు నంగునూర్ వేదిక కానుంది. రుణమాఫీ, రైతుబంధు, పంటలకు బోనస్ ఇవ్వకపోవడాన్ని నిరసిస్తూ ప్రభుత్వాన్ని నిల దీయడానికి ఈనెల 27న నంగునూర్‌లో రైతు మహాధర్నా నిర్వహించడం జరుగుతుందని మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు తెలిపారు. ఈ సందర్భంగా శనివారం సన్నాహక ఏర్పాట్లపై రైతులు, పార్టీ నాయకులతో టెలికాన్ఫరెన్స్ నిర్వహించి మాట్లాడారు. రైతులకు ఇచ్చిన హామీలు అమలు చేసే వరకు వదిలిపెట్టబోమని ప్రభుత్వాన్ని హెచ్చరించారు. అధికారంలోకి రాగానే రూ. 2 లక్షల రుణమాఫీ ఏకకాలంలో చేస్తామని మాట తప్పిందన్నారు. తూతూ మంత్రంగా రుణామాఫీ చేసి డబ్బాకొట్టుకుంటుం దన్నారు. రైతుభరోసాకు నేటికి దిక్కులేదన్నారు. నంగునూర్‌లో నిర్వహించే రైతు ధర్నాకు రైతులు, రైతు కుటుంబ సభ్యులు, పార్టీ శ్రేణులు పెదద్ద సంఖ్యలో తరలివచ్చి విజయవంతం చేయాలన్నారు. నంగునూర్‌లో చేపట్టే నిరసన సెగ ప్రభుత్వానికి తగలాలన్నారు. రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని బిఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. రుణమాఫీ పూర్తి స్థాయిలో చేసే వరకు పంటలకు బోనస్ ఇప్పించే వరకు ప్రభుత్వంపై బిఆర్‌ఎస్ నిరంతరం పోరాటం చేస్తుందన్నారు.



మెదక్ | సంగారెడ్డి | సిద్దిపేట

# వార్త

## ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలను సవరించాలి

**-ఎస్‌టియు టిఎస్ జిల్లా అధ్యక్షుడు రాజగోపాల్‌గౌడ్**

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్21 ప్రభాతవార్త:** ఉపాధ్యాయుల సర్దుబాటు నిబంధనలను సవరిం చాలని ఎస్టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షులు రాజగోపాల్‌గౌడ్ అన్నారు. శనివారం ఆయన మాట్లాడుతూ, వర్క్ అడ్జస్ట్‌మెంట్ చేసినట్లయితే పాఠశాలల్లో నమోదు తగ్గే అవకాశం ఉందని, సమీప భవిష్యత్తులో మూతపడే పరిస్థితి వస్తుందన్నారు. రాబోయే రోజుల్లో ఉపాధ్యాయ నియామకాలు చేపట్టే అవకాశం ఉండదన్నారు. 1-10 విద్యార్థుల వరకు ఏకోపాధ్యాయుడు పాఠశాలలను నడిపిపంచడం సాధ్యమవు తుందా, ఇందులో ఏ శాస్త్రీయత ఉందని ప్రశ్నించారు. ప్రాథమిక పాఠశాలలు సజావుగా పనిచేయా లంటే తరగతికి ఒక ఉపాధ్యాయుడు ఉండాలన్నారు. వర్క్ అడ్జస్ట్‌మెంట్‌లో వెంటనే మార్పులు చేయాల న్నారు. ఒకటి నుండి పదివరకు ఇద్దరు ఉపాధ్యాయులను ఉంచాలని, 11-60వరకు ఒక హెడ్‌మాస్టర్, ముగ్గురు ఉపాధ్యాయులను ఉండాలన్నారు. 60పైనఉన్న ప్రతి పాఠశాలలో పీఎస్ హెచ్‌మెం, తరగతికి ఒక ఉపాధ్యాయుడిని నియమించాలని, మండలంలోని అన్ని ఉన్నత పాఠశాలల్లో అదనంగా గుర్తించిన ఉపాధ్యాయులను ప్రాథమిక, ప్రాథమికోన్నత, ఇతర ఉన్నత పాఠశాలల్లో సర్దుబాటు చేయాలన్నారు.



మాట్లాడుతున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్

**ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ నమోదు చేసుకొని**

## సొంత ఇంటి స్థలాలను రెగ్యులర్ చేసుకోండి

**-జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** హెచ్‌ఎండీఏ పరిధిలో గల అన్ని గ్రామపంచాయతీలకు సంబంధించిన లేఅవుట్‌లో డీటీసీపీ లే అవుట్‌లు సొంత పట్టా ఇంటి స్థలం కలిగి ఉన్న లబ్ధిదారులు 2020 ఆగస్టు 26వ తేదీ వరకు డాక్యుమెంట్ చేయబడిన ప్రతి ఒక్క ఇంటి స్థలాన్ని ఆన్‌లైన్‌లో ఎల్ఆర్ఎస్ నమోదు చేసుకొని సొంత ఇంటి స్థలా లను రెగ్యులర్ చేసుకోవాలని జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ తెలి పారు. శనివారం ఆయన మాట్లాడుతూ గతంలో ఎల్ఆర్ఎస్ నమోదు చేసుకున్న వారు కాకుండా చేయనివారు ప్రస్తుతం కూడా మీసేవ యందు ఆన్‌లైన్ చేసుకొని సంబంధిత పత్రాలను గ్రామ పంచాయితీలో సమర్పించాలని తెలిపారు. గతంలో ఆన్‌లైన్ చేసుకున్న వారు సంబంధిత ఎల్ఆర్ఎస్ ఆన్‌లైన్ ఫామ్ డాక్యుమెంట్ తీసుకొని మండల అధికారులను సంప్రదించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మండల తహశీల్దార్ గంగాభవాని, ఎంపీడీవో ఉమాదేవి, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## కొల్చారంలో మండల సమైక్య వార్షిక మహాసభ



సమావేశంలో మాట్లాడుతున్న డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు

**కొల్చారం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** మండలకేంద్రంలోని మండల సమైక్యలో శనివారం 16వ వార్షిక మహాసభ సమావేశం నిర్వహించడం జరిగింది. సమావేశానికి ముఖ్య అతిథిగా డీఆర్‌డీఏ పీడీ శ్రీనివాసరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఆర్థిక ప్రగతిలో ఈ సంవత్సరానికి గాను బ్యాంక్ లింకేజ్ 130 శాతం సాధించాలని, ప్రతి గ్రామ సంఘంలో 0.5 శాతం ఎన్‌పీఏ కన్న తక్కువ ఉండాలని, ప్రతి గ్రామంలో సంవత్సరంలో 20 మంది కుటుంబాలు నెలకి 10 వేల నుండి 30 వేల వరకు సుస్థిరాదాయం వచ్చేలా వ్యాపారాలను చేయాల న్నారు. సామాజిక ప్రగతిలో ప్రతి సభ్యురాలు నా యొక్క నా బాధ్యత కార్యక్రమంలో కొల్చారం మండలంలో 7,484 సభ్యులతో మొక్కలను నాటించాలని చెప్పారు. ఇలాంటి కార్యక్రమాల వల్ల సామాజిక అభివృద్ధి కలుగుతుందని వివరించారు. కార్యక్రమంలో డీపీఎంలు జాన్ కెనడీ, ఐబీ, ఫామ్ డీపీఎం ప్రకాష్, ఎంపీడీవో కృష్ణవేణి, ఏపీఎం సుశీల్వ, సీసీలు వెంకటేష్, సబిత, విజయలక్ష్మీ, తనుజ, ఐసీడీపీస్ సుప్రవైజర్, అకౌంటెంట్, లాస్య అధ్యక్షురాలు, శ్వేత, మౌనిక, శాంత, అశ్విని, వివిధ గ్రామాల సంఘాల అధ్యక్షులు, సభ్యులు పాల్గొనడం జరిగింది.

## పాతూరులో పడిన పిడుగు

**పాపన్నపేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని పాతూర్‌లో శనివారం సాయంత్రం పిడుగు పడింది. సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురుస్తున్న తరుణంలో రాముని పాదాల వద్ద ఉన్న వేప చెట్టుపై పిడుగు పడగా చెట్టు కొమ్మ విరిగి కింద పడింది. పిడుగు పడిన సంఘటనలో ఎవరికి ఎలాంటి ప్రమాదం జరుగకపోవడంతో గ్రామస్థులు ఊపిరి పీల్చుకున్నారు.

## క్రీడలు మానసికోల్లాసానికి దోహదం

**రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ వెంకటయ్య, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి**

**దుబ్బాక (అక్బర్‌పేట భూంపల్లి), సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** విద్యా ర్థులు విద్యాతో పాటు క్రీడరంగాలో మంచి ప్రతిభను కనబర్చాలని, క్రీడలు మానసిక ఉల్లాసానికి దోహద పడుతాయని రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ కూర రఘోత్తంరెడ్డి అన్నారు. శనివారం అక్బర్‌పేటభూంపల్లి మండల పరిధిలోని భూంపల్లి లో ఉన్నత పాఠశాలలో 68వ (ఎస్.జి.ఎఫ్.ఐ) స్కూల్ గేమ్స్ ఫెడరే షన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో మండలస్థాయి క్రీడ ముగింపు వేడు కల సందర్భంగా రాష్ట్ర ఎస్‌సి, ఎస్‌టి కమిషన్ చైర్మన్ బక్కి వెంకటయ్య, ఎమ్మెల్సీ కూర రఘోత్తం రెడ్డి ముఖ్యతిథులుగా హాజరై మాట్లాడారు. విద్యార్థులు విద్యాతో పాటుగా క్రీడ రంగాలో ప్రతిభను కనబర్చి తల్లిదండ్రులకు, గురువులకు, సిద్దిపేట జిల్లాకు మంచి పేరు తీసుకు రావాలని విద్యార్థులను కోరారు. క్రీడ రంగాల్లో గెలుపోటములు సహజమని ప్రతి ఒక్కరు క్రీడా స్ఫూర్తిని చాటాలన్నారు. అనంతరంగా క్రీడల్లో గెలుపొందిన విద్యార్థులకు బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ ప్రభుదాస్, ప్రధానోపాధ్యాయులు రవీందర్, అక్బర్‌పేటభూంపల్లి పిఆర్‌టియు అధ్యక్షులు సిద్దివెంకటేష్, చంద్రా రెడ్డి, అంజాగౌడ్, ఫిజికల్ డైరెక్టర్లు, పాఠశాల సిబ్బంది పాల్గొన్నారు.

## మండలంలో కురిసిన భారీ వర్షం

**నీట మునిగిన పంటలు.. అయోమయంలలో అన్నదాతలు**

**న్యాల్‌కల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండలంలోని శనివారం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. అకాల వర్షానికి పెసర, పత్తి, మినుపు, సోయాబీన్ పంటలు నీటిపాలయ్యాయి. అకాల వర్షానికి నష్టపోయిన రైతులను ప్రభుత్వం పరిహారం అందించి ఆదుకోవాలని మండల రైతులు వినతి చేస్తున్నారు.



న్యాల్‌కల్‌లో భారీ వర్షానికి పంట పొలాల్లోకి నీరు చేరిన దృశ్యం

# వంద పడకల ఆసుపత్రి కోసం స్థల పరిశీలన

**మంత్రి ఆదేశాలతో గుమ్మడిదల ఆరోగ్య కేంద్రాన్ని పరిశీలించిన అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి గాయత్రిదేవి**

**గుమ్మడిదల, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** గుమ్మడిదల మండల ఆరోగ్య కేంద్రాన్ని శనివారం రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహా ఆదేశాల మేరకు జిల్లా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి దేవిలు సంద ర్శించి స్థల పరిశీలన చేశారు. గుమ్మడిదల మండల నాయకులు శుక్రవారం మంత్రి దామోదర రాజ నర్సింహను కలిసి మండలంలోని ఆసుపత్రికి సం బంధించిన సమస్యను వివరించగా సానుకూలంగా స్పందించడంతోపాటు శనివారం అధికారులు స్థలాన్ని పరిశీలించి యుద్ధ ప్రాతిపదికన భూ విస్తరణ సర్వే నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ చంద్రశేఖర్ మాట్లాడుతూ మంత్రి ఆదేశాల ప్రకారం మండలంలోని ప్రజలకు అవసరాలకు అనుగుణంగా జాతీయ రహదారిపై తరచూ జరిగే రోడ్డు ప్రమా దాలు, చుట్టుపక్కల జరిగే అత్యవసర ప్రమాదాలు సంభవిస్తేవారికి వైద్యసేవలు అందించడానికి మూడు రకాల కేంద్రాలను నిర్వహించే విధంగా ఉంటుందని, అందులో ముఖ్యంగా అత్యవసర వైద్య సేవా కేంద్రం (ట్రామా సెంటర్), 30 లేదా 50 పడకలు, ముందు చూపుగా 100 పడకల ఆసుపత్రిగా ఆధునికరించడం కోసం అధికారులు, నాయకులతో చర్చించారు. ఏ



స్థల పరిశీలన చేస్తున్న అదనపు కలెక్టర్ చంద్రశేఖర్, జిల్లా వైద్యాధికారి డాక్టర్ గాయత్రి దేవి

సెంటర్ ఏర్పాటుచేయాలో సంపూర్ణ నివేదికను వైద్య ఆరోగ్య శాఖ మంత్రికి నివేదించనున్నట్లు తెలిపారు. ఆదివారం సంగారెడ్డి కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో పూర్తి నివేదికను సిద్ధం చేసి మంత్రికి అందజేయనున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మాజీ జెడ్పీటీసీ కుమార్‌గౌడ్, మాజీ సర్పంచి నర సింహారెడ్డి, జిల్లా ఇంజనీర్ రవీందర్, కమ్యూనిటీ కోఆర్డినేటర్ సంగారెడ్డి, మండల తహశీల్దార్ గంగా భవాని, మండల అభివృద్ధి అధికారి డి. ఉమాదేవి, వైద్యాధికారి డా. మధుకర్, ఎంపీహెచ్ఈవో శ్రీనివాసరావు, రెవెన్యూ ఇన్స్‌పెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# 28న మెదక్‌లో జిల్లా స్థాయి క్రీడోత్సవాలు

**ఇందిరాగాంధీ స్టేడియం, పీఎన్ఆర్ స్టేడియంలో క్రీడాపోటీల నిర్వహణ.. జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి దామోదర్‌రెడ్డి**

**సంగారెడ్డి బ్యూరో, సెప్టెంబర్21 ప్రభాతవార్త:** రాష్ట్ర ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహించాలనే ఉద్దేశంతో ప్రాధాన్యతనిస్తూ ఈ నెల 28వ తేదీన జిల్లా కేంద్రమైన మెదక్ పట్టణంలోని ఇందిరా గాంధీ స్టేడియం, పీఎన్ఆర్ స్టేడియంలలో జిల్లా స్థాయి క్రీడల పోటీలను నిర్వహించనున్నట్లు జిల్లా యువజన, క్రీడల శాఖ అధికారి వై. దామోదర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దీనికి సంబంధించి జిల్లా స్థాయి యువజనోత్సవాలకు సంబంధించి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లా స్థాయి ఈ నెల 28 ఉదయం 10 గంటల నుంచి జిల్లా కేంద్రం మెదక్‌లోని ఇందిరా గాంధీ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించే క్రీడలకు 15-28 సంవత్సరాల వయస్సు గల యువతీ యువకులకు పోటీలు నిర్వహించడం జరుగుతుందని, అలాగే సాంస్కృతిక విభాగం పోటీలను ఇందిరా గాంధీ అవుట్ డోర్ స్టేడియంలో నిర్వహించనున్నట్లు వివరించారు. క్రీడలకు సంబంధించిన వివరాలు ఇలా.. జానపద నృత్యం, జానపద గీతాలు, హస్త కళలు, వస్త్రం, ఆర్ట్ ఉత్పత్తులు, కథా రచన, పెయింటింగ్, డిక్లమేషన్/ఎల్యుకేషన్ పోటీలను స్థానిక పీఎన్ఆర్ ఇండోర్ స్టేడియంలో నిర్వహించడం జరుగుతుందని తెలిపారు. ప్రథమ స్థానంలో గెలుపొందిన ఒక జట్టును జిల్లా స్థాయిలో ఎంపిక చేసి రాష్ట్రస్థాయిలో జరిగే పోటీలకు పంపడం జరుగుతుందని, రాష్ట్ర స్థాయి పోటీలలో ఎంపికైన వారు 2025 జనవరి 12వ తేదీ నుంచి 2025 జనవరి 16వ తేదీ వరకు జరిగే జాతీయ స్థాయి పోటీలకు పంపడం జరుగుతుందని దామోదర్‌రెడ్డి తెలిపారు. ఈ క్రీడల్లో పాల్గొనే వారి అర్హతలు.. మెదక్ జిల్లా నివాసులై ఉండి వయస్సు పోటీ నిర్వహించు తేదీ నాటికి 15-28 సంవత్సరాలలోపు కలిగి ఉండాలని, మూడు సంవత్సరాల్లో నిర్వహించబడిన జాతీయ యువజన ఉత్సవాల్లో పాల్గొన్న యువతీ, యువకులు లేదా, గ్రూపులు ఈ పోటీలలో పాల్గొనేందుకు అనర్హులని ఆయన వివరించారు. మూడు పాస్‌పోర్టు సైజ్‌ఫొటోలు తీసుకురావాల న్నారు. గ్రూపు విభాగాల్లో యువతీ యువకులు పాల్గొనవచ్చని, వాయిద్య పరికరాలు పోటీలో పాల్గొనే కళాకారులు వెంట తీసుకురావాల్సిందిగా లైవ్ ప్రదర్శన చేసిన వారికి ప్రాధాన్యం ఉంటుంద న్నారు. ఈ పోటీల్లో పాల్గొనే వారికి ఉచితంగా మధ్యాహ్న భోజన సౌకర్యం ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ఈ అవకాశాన్ని అర్హులైన కళాకారులు, యువతీ యువకులు సద్వినియోగం చేసుకోవాల్సిందిగా కోరారు.



విజేతలకు బహుమతులు అందిస్తున్న ఎమ్మెల్సీ యాదవరెడ్డి

## చదువుతోపాటు క్రీడల్లోనూ రాణించాలి : ఎమ్మెల్సీ

**కొండపాక, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** విద్యార్థులు చదువుతోపాటు క్రీడ ల్లోనూ రాణించి జాతీయస్థాయి క్రీడలకు చేరుకొవాలని స్థానిక సంస్థల ఎమ్మెల్సీ వంటేరు యాదవరెడ్డి అన్నారు. శనివారం కుకునూరుపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో హెచ్‌ఎం బి. సత్తయ్య అధ్యక్షతన మూడు రోజులుగా జరుగుతున్న మండల స్థాయి స్కూల్ గేమ్స్ పెడరేషన్ అధ్వర్యంలో నిర్వహించిన క్రీడ పోటీల ముగింపు కార్యక్రమానికి అయన ముఖ్య అతిథిగా హజరై మాట్లాడారు. క్రీవల వల్ల శరీర దారుడ్యంతోపాటు మానసిక అనందం కలుగుతుందన్నారు. క్రీడల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయని వివరించారు. ప్రభుత్వం క్రీడలను ప్రోత్సహిచాలని అయన సూచించారు. ఎస్‌జిఎఫ్ క్రీడలు సాధారణంగా ఎదో ఒక రకమైన అటను మాత్రమే ఎన్నుకొని నిర్వహిస్తారని కాని ఇక్కడ మూడు రకాల అటలను ఎకకాలం పెద్దఎత్తున జాతీయ స్థాయి క్రీడలను నిర్వహిచినంత ఘనంగా ఇక్కడ క్రీడలను నిర్వహించినందుకు హెచ్‌ఎంను, ఉపాధ్యాయ బృందంను, దాతలను అయన అభినందించారు. క్రీడలను ప్రోత్సహించడానికి సహకరించిన పిఎన్‌అర్ ట్రస్ట్ చైర్మన్ నరేందర్‌ను అభినందించారు. క్రీడల్లో గెలుపొందిన విద్యార్థుకు బహుమతులను అందించారు. లైయన్స్ క్లబ్ గజ్వేల్ శాఖ తరపున ప్రింటర్, జిరాక్స మిషన్‌ను పాఠశాలకు ఉచితంగా అందించారు. విద్యార్థులు ప్రదర్శించిన ప్రదర్శనలు అతిధులను అబురపరిచాయి, కార్య క్రమంలో కుకునూరుపల్లి ఎస్సై శ్రీనివాస్, అర్‌టియు నాయకులు శ్రీనివాస్ రెడ్డి, రాంచంద్రారెడ్డి, పిఎన్‌అర్ ట్రస్ట్ చైర్మన్ నరేందర్, మల్లం ఐలయ్య, వివిధ పాఠశాలల హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు, ఎస్‌జిఎఫ్ కార్యదర్శి క్యాతం రాజ్‌కుమార్, లైయన్స్ క్లబ్ గజ్వేల్ శాఖ నాయకులు సంతోష్, మల్లేశం, తదితరులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలి

**-మున్సిపల్ చైర్మన్ రాజమౌళి**

**గజ్వేల్ టౌన్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** గజ్వేల్-ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ మున్సిపాలిటీని స్వచ్ఛ మున్సిపాలిటీగా తీర్చిదిద్దడానికి కృషి చేయాలని మున్సిపల్ చైర్మన్ ఎన్‌సి.రాజమౌళి పేర్కొన్నారు. స్వచ్ఛత హి సేవ 2024 కార్యక్రమంలో భాగంగా శనివారం గజ్వేల్‌లోని పాండవుల చెరువు వద్ద అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఇందులో భాగంగా స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయించడంతో పాటు మానవహారం ఏర్పాటు చేశారు. అనంతరం మున్సిపల్ చైర్మన్ రాజమౌళి మాట్లాడుతూ స్వచ్ఛత హి సేవ కార్యక్రమంలో భాగంగా వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. పరిశుభ్రత కోసం ప్రతి వారానికి రెండు గంటలు కేటాయించి శ్రమదానం చేయాలని, తడి, పొడి చెత్తను వేరుచేసి స్వచ్ఛ వాహనాలకు అందించానలి తెలిపారు. ఎవరైనా చెత్తను రోడ్లపై, మురికి కాల్వల్లో వేసినట్లయితే జరిమానా విధించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ గోల్కొండ నర్సయ్య, వైస్ చైర్మన్ జకియొద్దీన్, కౌన్సిలర్లు వంటేరు గోపాల్‌రెడ్డి, మామిడి విద్యారాణి శ్రీధర్, ఉప్పల మెట్టయ్య, బొగ్గుల చందు, కో-ఆప్షన్ సభ్యులు గంగిశెట్టి రాజు, మున్సిపల్ సానిటరీ ఇన్‌స్పెక్టర్ రవీందర్, మెప్మా అధికారి సరిత, మున్సిపల్ అధికారులు, జవాన్‌లు, ఆర్‌పిలు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.




స్వచ్ఛతపై ప్రతిజ్ఞ చేయిస్తున్న మున్సిపల్ చైర్మన్ రాజమౌళి

# కమీషన్ ఏజెంట్ల ద్వారానే రైతులకు లాభం

**ములుగు, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** కూరగాయ విక్రయాలు కమిషన్ ఏజెంట్ల ద్వారానే మార్కెట్‌యార్డుకు, రైతులకు అన్నివిధాలుగా లాభం జరుగుతుందని, మార్కెట్‌లో కూరగాయల క్రయవిక్ర యాలు అనుమతులు పొందిన కమీషన్ ఏజెంట్ల ద్వారానే నిర్వహించాలని కోరుతూ శనివారం కమీ షన్ ఏజెంట్లు ఆందోళనకు దిగారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ములుగు మండలం వంటి మామిడి కూరగాయల మార్కెట్‌లో ప్రతిరోజు ఉద యం, సాయంత్రం వేర్వేరుగా కూరగాయల క్రయ విక్రయాల మార్కెట్ జరుగుతుందని, ఇంతకు ముందు ఉదయం జరిగే మార్కెట్‌లో రైతులు నేరు గా కూరగాయలు అమ్ముకునేవారని తెలిపారు. ఇందులో కొంతమంది దళారులు ఇతర మార్కెట్‌ల నుంచి కూరగాయలు తెచ్చి విక్రయిస్తున్నారని, దీని వల్ల రైతుకు గిట్టుబాటు ధర లభించడంలేదన్నారు. దీంతో ఉదయం పూట నిర్వహించే మార్కెట్‌లో రైతులు కమిషన్ ఏజెంట్లవద్ద విక్రయాలు జరపాలని నిర్ణయించగా శనివారం ఎలాంటి అనుమతులులేని కొంతమంది దళారులు వచ్చి క్రయవిక్రయాలను అడ్డుకోవడంతో కమిషన్ ఏజెంట్లకు, దళారులకు మధ్య వాగ్వాదం జరిగింది. సాయంత్రం జరిగే మార్కెట్‌లో కూరగాయలు విక్రయించడానికి వచ్చే



వంటిమామిడి మార్కెట్ వద్ద ఆందోళనకు దిగిన కమీషన్ ఏజెంట్లు

రైతులు గేటు వదనద కూరగాయల వివరాలను నమోదు చేయనీయకుండా కమిషన్ ఏజెంట్లు అడ్డు కున్నారు. మార్కెట్‌కు అన్ని రకాల ఫీజులు చెల్లి స్తున్న తమకే కూరగాయల క్రయవిక్రయాలు నిర్వ హించే హక్కులు ఉన్నాయని ఆందోళనకు దిగారు. దళారులు వచ్చి కూరగాయలు విక్రయించకుండా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మార్కెట్ కార్యదర్శి రేవంత్ మాట్లాడుతూ ఉన్నతాధికారుల అనుమతితో మార్కెట్‌యార్డుకి, కమిషన్ ఏజెంట్లకు, రైతులకు ఎలాంటి నష్టం వాటిల్లకుండా త్వరలోనే చర్యలు తీసుకుంటామని కమిషన్ ఏజెంట్లు ఆందోళన విరమించి సహకరించాలని తెలిపారు.

## రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించి నీతులు చెబుతున్న హరీష్‌రావు

**-ఎఎంసి వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్**

**గజ్వేల్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** పదేళ్లపాటు పాలించిన బిఆర్‌ఎస్ రాష్ట్రాన్ని భ్రష్టుపట్టించగా, కాళేశ్వరం అవినీతి సొమ్ముతో రైతు లను మాజీ మంత్రి హరీష్‌రావు రెచ్చగొడుతున్నట్లు గజ్వేల్ వ్యవసాయ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ సర్దార్‌ఖాన్ ఆరోపించారు. శనివారం ఆయన గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కాళేశ్వరం ప్రాజెక్టులో భాగంగా మేడిగడ్డ ప్రాజెక్టు పిల్లర్లు కుంగిపోగా, అన్నారం బ్యారేజీలో బుంగలుపడిన విషయాన్ని పక్కదారి పట్టించడానికి ఎమ్మెల్యేల బృందంతో మల్లన్నసాగర్ ప్రాంతాన్ని మాజీ మంత్రి హరీష్ రావు సందర్శించడం సిగ్గుచేటన్నారు. ముఖ్యంగా కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మాణంపై కమిషన్ దర్యాప్తు జరుగుతుండగా, ప్రజలను ఈ అంశంపై పక్కదారి పట్టించడానికే వెళ్లినట్లు తెలిపారు. ముంపు గ్రామాలను నిండా ముంచిన బిఆర్‌ఎస్ సర్కార్, అప్పటి కలెక్టర్ వెంకట్రాంరెడ్డి, మాజీ మంత్రి హరీష్‌రావు ఎన్నో హామీలు ఇచ్చి నిర్వాసితులను ఆగం చేశారని అన్నారు. రాష్ట్రాన్ని అప్పుల ఊబిలో ముంచిన కెసిఆర్ సర్కార్ చేసిన పనులకు బిల్లులు చెల్లించలేకపోవడంతో ప్రస్తుత కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర భారం పడుతున్నట్లు చెప్పారు. ఎన్నికల సమయంలో కాంగ్రెస్ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయడంతో పాటు రైతులకు రూ.2 లక్షల రుణమాఫీ చేయడం జీర్ణించుకోలేకపోతున్నారని అన్నారు.

## టిజిపిఎస్‌సి పరీక్షల్లో దత్తుకు మొదటి ర్యాంకు

**నాగల్‌గిద్ద, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** టీజీపిఎస్సీ హాస్టల్ వెల్ఫేర్ ఆఫీసర్ ఫలితాల్లో నాగల్‌గిద్దకు చెందిన ఉపాధ్యాయులు జి దత్తు మొదటి ర్యాంకును సాధించాడు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో దత్తు చార్మినార్ జోన్‌లో మొదటి ర్యాంకు సాధించడం పట్ల గ్రామస్థులతో పాటు పాఠశాల ఉపాధ్యాయులు ప్రత్యేకంగా అభినందించారు.

## కూలిన చెట్టు-ఆగిన ప్రయాణం

**న్యాల్‌కల్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖలీల్‌పూర్ గ్రామ శివారులో నారింజ వంతెన వద్ద (జహీరాబాద్-బీదర్ రోడ్డు) సాయంత్రం ఉరుములు మెరుపులతో కూడిన భారీ వర్షానికి చెట్టు కూలి రోడ్డుపై పడిపోయింది. రోడ్డుపై చెట్టు కూలడంతో అటుగా వెళ్లే వాహనాలు ఎక్కడికి అక్కడ ఆగిపోవడంతో రోడ్డు జామ్ అయింది. రోడ్డును క్లియర్ చేసేందుకు పోలీసులు పాట్లు పడాల్సి వచ్చింది.

## గుండెపోటుతో మాజీ ఎంపిటిసి మృతి

**మర్కుక్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** మండల పరిధిలోని దామర కుంట గ్రామానికి చెందిన మాజీ ఎంపిటిసి ఆకుల బలరాం ముదిరాజ్ శనివారం గుండెపోటుతో మృతి చెందారు. గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం మృతుడికి భార్య లక్ష్మి, కూతురు, కుమారుడు ఉన్నారు. ఇరు వురికి వివాహాలు కాగా కుమారుని సంసార జీవితంలో సమస్యలు నెల కొన్నాయి. దీంతో కోడలి కుటుంబసభ్యులు బలరాం ఇంటికి శనివారం వచ్చి గొడవ చేయడంతో గుండెపోటుకు గురై మృతిచెందినట్లు తెలిసింది. బలరాం మృతి విషయం తెలుసుకున్న పలువురు మాజీ ప్రజాప్రతి నిధులు, నాయకులు, గ్రామస్తులు అంత్యక్రియల్లో పాల్గొన్నారు.

## పిడుగు పాటుకు పాడిగేదె మృతి

**అక్కన్నపేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** పిడుగు పాటుకు పాడి గేదె మృతి చెందిన సంఘటన అక్కన్నపేట మండలం గొల్లపల్లి గ్రామం లో జరిగింది. వివరాల్లోకి వెళితే... శుక్రవారం సాయంత్రం గొల్లపల్లి గ్రామానికి చెందిన రైతు అల్లాడి సతీష్‌కు చెందిన పాడి గేదెను పాలు పితికి వ్యవసాయ క్షేత్రంలో కట్టేసి వెళ్లగా రాత్రి ఉరుములు, మెరుపులతో కురిసిన వర్షంలో పిడుగుపడి గేదె మృతి చెందినట్లు గ్రామస్థులు చెబుతున్నారు. రైతు సతీష్ పేద కుటుంబానికి చెందినవాడని, ఉన్న పాడి గేదే ఇచ్చే పాలను అమ్ముకుని కుటుంబాన్ని పోశించుకునే వాడని ఈ విషయంపై సంబంధిత అధికారులు విచారణ చేబట్టి ప్రభుత్వానికి నివేదిక పంపి నష్ట పరిహారం అందించాలని కోరుతున్నారు.

### అంతర్గాంలో ఎద్దు...

**సిర్గాపూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** పిడుగు పాటుకు గురై ఎద్దు మృతి చెందిన సంఘటన మండలంలోని అంతర్గాంలో శనివారం చోటు చేసుకుంది. గ్రామస్థుల కథనం ప్రకారం... గ్రామానికి చెందిన గైని అంజయ్య తన కాడెద్లను పొలం గట్టు వద్ద కట్టేసి వ్యవసాయం పనులు చేసుకుంటున్నాడు. సాయంత్రం ఒక్కసారిగా ఉరుములు మెరుపులతో భారీ వర్షం కురిసింది. పొలం గట్టుపై కట్టేసిన ఎద్దుపై పిడుగు పడటంతో ఎద్దు అక్కడికి అక్కడే మృత్యువాత పడింది. మృతి చెందిన ఎద్దు 75 వేల వరకు ఉంటుందని బాధితుడు అంజయ్య పేర్కొన్నారు. ప్రభుత్వం తనను ఆదుకోవాలని రైతు అంజయ్య వినతి చేస్తున్నాడు.

## అప్పుల బాధతో వ్యక్తి ఆత్మహత్య

**నర్సాపూర్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** అప్పుల బాధతో ఒక వ్యక్తి ఉరేసుకుని ఆత్మహత్య చేసుకున్న సంఘటన నర్సాపూర్ మండలం తుజాల్‌పూర్ గ్రామ పరిధిలోగల అర్జు తండాలో శనివారం జరిగింది. ఎస్ఐ లింగం కథనం ప్రకారం... ఆర్జుతండాకు చెందిన హలావత్ శ్రీని వాస్(41) వ్యవసాయం చేసుకుంటూ జీవనం కొనసాగించేవాడని తెలి పారు. తండ్రి హలావత్ లచ్చయ్యకు కొన్నిరోజులుగా ఆరోగ్యం బాగా లేనందున ప్రైవేటు ఆసుపత్రులకు చూపించంగా వైద్యం ఖర్చుల కోసం రూ. 4 లక్షలవరకు అప్పులయ్యాయని తెలిపారు. తండ్రి ఆరోగ్యం కోసం తెచ్చిన అప్పులు అధికమవడంతో ఎలా తీర్చాలో తెలియక రోజూ మదన పడుతూ ఉండేవాడని తెలిపారు. ఈ క్రమంలో శనివారం మధ్యరాత్రి 1 గంటల సమయంలో భార్య హలావత్ లక్ష్మికి బయటకు వెళ్లివస్తానని చెప్పి వెళ్లిపోయాడని తెలిపారు. ఎంతకి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు వెళ్లి వెతుకుతుండగా తెల్లవారుజామున 6గంటల సమయంలో ఇంటి వెనకగల చెట్టుకు ఉరేసుకొని మృతి చెంది ఉన్నాడని తెలిపారు. మృతుడు శ్రీనివాస్ భార్య లక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ లింగం తెలిపారు.

## అనుమానాస్పద స్థితిలో చెరువులో చేపలు మృతి

**బెజ్జంకి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** మండల కేంద్రంలోని చేపల చెరువులో గుర్తు తెలియని వ్యక్తులు విష పూరితమైన మందులను కలప డంతో రూ.20 లక్షలపైన విలువగల చేపలు మృతి చెందినట్లు బాధి తుడు అక్కరవేణి పోచయ్య తెలిపారు. రెండేళ్లుగా చేపల చెరువును లీజుకు తీసుకొని పెంచుతున్నాని రోజులాగే ఉదయం చెరువు వద్దకు వెళ్ల గా చెరువులోని చేపల నీటిపై తెలి మృతి చెందినట్లు గుర్తించిన బాధి తుడు పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. గుర్తు తెలియని వ్యక్తులు రెండు రోజులుగా చేపల చెరువులో విషపూరిత మందులను కలుపుతు న్నారని వారిని గుర్తించి న్యాయం చేయాలని పోచయ్య కోరుతున్నారు.



మృతి చెందిన చేపలు



భక్తులకు అక్షింతాలు అందిస్తున్న రామకోటి రాజు

## ధర్మాజీపేటలో ముత్యాల తలంబ్రాల పంపిణీ

**దుబ్బాక, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** సిద్దిపేట జిల్లా గజ్వేల్ పట్టణం లోని శ్రీరామభక్త సమాజం చేస్తున్న సేవకుగాను భద్రాచల దేవస్థానం అందించిన తలంబ్రాలను శనివారం దుబ్బాక పట్టణ పరిధిలోని ధర్మాజీ పేట వార్డులోని ఋషి విద్యాలయంలో గ్రామస్థులకు సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు భక్తరత్న, కళారత్న, సేవరత్న, అవార్డుగ్రహీత రామకోటి రాజు అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక్కడి ప్రజలు పెద్దఎత్తున రామా నామాన్ని స్మరిస్తూ గోటితో ఒడ్లను వోలచి భద్రాచల కల్యాణానికి అందించారు. వీరి భక్తికిగాను కల్యాణ ముత్యాల తలంబ్రాలు అందిస్తున్నానన్నారు. ఈ సందర్భంగా తలంబ్రాలు అందుకున్న భక్తులు మాట్లాడుతూ రామకోటి రామరాజు కృషి , పట్టుదల వల్ల మా గ్రామానికి మొదటిసారిగా ముత్యాల తలంబ్రాలు రావడం మా అదృష్టం అన్నారు. అనంతరం రామరాజుని గ్రామస్తులు సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఋషి విద్యాలయం కరస్పాండెంట్ కారంపురి రవి, గ్రామస్తులు పాల్గొన్నారు.

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి : తిరుపతి



సముద్రాలలో స్వచ్ఛ హి సేవా కార్యక్రమం దృశ్యం

**హుస్నాబాద్(కోహెడ) సెప్టెంబరు21, ప్రభాతవార్త :** స్వచ్చన హి సేవా కార్యక్రమంలో సముద్రాల గ్రామ రూపురేఖలు మార్చుకుందామని పంచాయతి కార్యదర్శి రేగుల తిరుపతి ప్రజలకు పిలుపునిచ్చారు. శనివారం గ్రామంలో ఇంటింటికి తిరుగుతూ గ్రామంలో ఉన్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్బంగా తడి, పొడి చెత్తలపై ప్రజలకు అవగాహన కల్పించారు. అనంతరం మాట్లాడుతూ ప్రజలు వ్యక్తిగత శుభ్రతతో పాటు పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాలలో మురుగు నీరు నిల్వలేకుండా ఉంచుకోవాలని, నిల్వ ఉండడటం వల్ల సీజనల్ వ్యాధులకు వచ్చే అవకాశం ఉందన్నారు.అంతేకాకుండా కాలనీలో సీసీ రోడ్లకు ఇరువైపులా పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం వార్డులో పూర్తిగా కావాల్సిన కరెంట్ స్తంభాలను వేయించాలని విద్యుత్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మాజీసర్పంచ్ పిల్లి మాధవి రాజయ్య, ఏఎన్ఎమ్ రమాదేవి, అంగన్‌వాడీ టీచర్లు, ఆశా కార్యకర్తలతో పాటు మహిళా సంఘం సిఎలు పారిశుధ్య కార్మికులు పాల్గొన్నారు.

## 'స్వచ్ఛతా హి సేవ'లో ప్రతి ఒక్కరూ పాల్గోవాలి

**న్యాయమూర్తి సాయి రమాదేవి, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్**

**సిద్దిపేట, ప్రభాతవార్త ప్రతినిధి:**



చీపుర్లతో చెత్తను తొలిగిస్తున్న న్యాయమూర్తి, మున్సిపల్ కమిషనర్

స్వచ్ఛతా హి సేవ కార్యక్రమంలో ప్రతి ఒక్కరూ పాల్గొని ఇంటి పరిసరాలను, వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని న్యాయమూర్తి సాయి రమాదేవి, మున్సిపల్ కమిషనర్ అశ్రిత్‌కుమార్ అన్నారు.స్వచ్ఛతా హి సేవలో భాగంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల మేరకు జిల్లా కేంద్రంలో శనివారం జిల్లా కోర్టు అవరణలో వారు చీపుర్ల చేత బూని చెత్త చెదారాన్ని, ప్లాస్టిక్ బాటిళ్లను తొలిగించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల అదేశాల మేరకు కోర్టు అవరణలో స్వచ్ఛతా హి సేవ కార్యక్రమం నిర్వహించడం జరిగిందన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటనే ఆరోగ్యవంతమైన జీవితాన్ని గడుపుతామన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ కార్మికులకు కమిషనర్ అశ్రిత్‌కుమార్ మెడికల్ హెల్త్న క్యాంపు నిర్వహించారు. కార్మికులు ఆరోగ్యాన్ని కాపాడుకోవాలన్నారు. కార్యక్రమంలో ఏఈలు, శానిటరీ ఇన్‌స్పెక్టర్లు, న్యాయవాదులు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధికి మాజీ సర్పంచ్ రూ. 20 వేలు అందజేత

**దుబ్బాక, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** అక్బర్‌పేట భూంపల్లి మండల పరిధిలో చిట్టాపూర్ గ్రామంలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడు వసంత్‌నాయక్ ఆధ్వర్యంలో విదార్థుల తల్లిదండ్రులకు, ఉపాధ్యాయులతో పాఠశాల అభివృద్ధి సమావేశాన్ని శనివారం నిర్వహించారు. సమావేశానికి ముఖ్యఅధితిగా మాజీ సర్పంచ్ పోతనక రాజయ్య హాజరై పాఠశాల అభివృద్ధి కోసం 20 వేల రూపాయలను ప్రధానోపాధ్యాయునికి అందించడం జరిగింది. ఈ సందర్భంగా పోతనక రాజయ్య మాట్లాడుతూ ప్రాథమిక పాఠశాలలు విదార్థుల భవిష్యత్‌కి మెదటిదశ అన్నారు. గ్రామంలోని పాఠశాల అభివృద్ధికి తమవంతు సహాయ సహకారాలు ఎప్పటికి ఉంటాయన్నారు. కార్యక్రమంలో పాఠశాల సిబ్బంది జ్యోతిలక్ష్మి, భాగ్యలక్ష్మి, యాదయ్య, నారాయణ, కాంగ్రెస్ పార్టీ గ్రామ అధ్యక్షుడు రెడ్డి బాల్‌నర్సింలు, మాంతురి పెంటయ్య, యెలగారి అశోక్, మహిళలు, పాల్గొన్నారు.

## టిపిసిసి అధ్యక్షుడికి సన్మానం

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** టిపిసిసి అధ్యక్షులు, ఎమ్మెల్యే బొమ్మ మహేష్‌కుమార్‌గౌడ్‌ను హైదారాబాద్‌లో శనివారం కలిసి డీసీసీ ఓబీసీ సెల్ అధ్యక్షులు డాక్టర్ లక్కరసు సూర్యచంద్రవర్మ శాలువాలతో ఘనంగా సత్కారించారు. ఈ సందర్భంగా డాక్టర్ సూర్యచంద్రవర్మ మాట్లాడుతూ టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్ ఆధ్వర్యంలో రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ మరింత బలోపేతం అవుతుందన్నారు. మహేష్‌కుమార్‌గౌడ్ నేతృత్వంలో రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా కాంగ్రెస్ జెండా మరో మారు రెపరెపలాడుతుందన్నారు. రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ విజయం కోసం కృషి చేస్తామన్నారు. ఆయన వెంట డీసీసీ ఓబీసీసెల్ నాయకులు జంగోని శ్రీనివాస్‌గౌడ్, దిలీప్‌కుమార్,బంక చిరంజీవి యాదవ్, మిద్దె ప్రసాద్‌గౌడ్, గరిపల్లి వెంకటిరాజు ఉన్నారు.



టిపిసిసి అధ్యక్షులు మహేష్‌కుమార్‌గౌడ్‌ను సన్మానిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్, హాజరైన కార్యకర్తలు

# పార్టీ మారినోళ్లను తిరిగి చేర్చుకునే ప్రసక్తే లేదు

**స్థానికసంస్థల ఎన్నికలను కార్యకర్తలు సిద్ధం కావాలి**

**మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్‌కుమార్**

**హుస్నాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** బిఆర్ఎస్ నుంచి ఇతర పార్టీల్లోకి మారిన వారిని తిరిగి చేర్చుకునే ప్రసక్తేలేదని మాజీ ఎమ్మెల్యే వొడితల సతీష్ కుమార్ అన్నారు. శనివారం శుభం గార్డెన్‌లో జరిగిన బిఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ విస్తృతస్థాయి సమావేశానికి ఆయన ముఖ్య అతిది గా హాజరయ్యారు.ఈ సందర్బంగా ఆయన మాట్లాడుతూ రానున్న స్థానిక సంస్థల ఎన్నికలకు నాయకులు, కార్యకర్తలు సిద్దం కావాలన్నారు.ఈ పోటీల్లో గతంలో మాదిరిగానే అన్ని స్థానాలను పార్టీ కైవసం చేసుకునేలా ప్రతీ కార్యకర్త పనిచేయాలని సూచించారు. కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలమయ్యాయన్నారు.హామీల అమలులో కాలయాపన చేస్తున్న కాంగ్రెస్, బిజెపిలను తక్షణమే గద్దె దించాలన్నారు. ఇచ్చిన హామీలు అమలు చేయని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల తీరును ప్రజల్లోకి తీసు కెళ్లాలని రాష్ట్రంలో అధికార ంలోకి వచ్చిన కాంగ్రెస్ ఆరు గ్యారంటీలను 100 రోజుల్లో అమలుచేస్తానని చెప్పి ఇప్పటివరకు ఎందుకు అమలుచేయలేదో ప్రజలకు వివరించాలన్నారు. ఇప్పటివరకు రైతు రుణమాఫీ పూర్తి స్థాయిలో కాలేదని, గ్యాస్‌రాయితీ డబ్బులు లబ్దిదారుల అకౌంట్‌లలో పడిన దాఖలాలు లేవని, గృహలక్ష్మి ద్వారా ఇళ్లు కట్టించుకునే వారి ఊసే ఎత్తడం లేదని, ఆసరా పెన్షన్‌ల పెంపు, రేషన్‌కార్డులు, హెల్త్‌కార్డులు ఇస్తామని చెప్పి ఏడాది కావస్తున్నా ఎందుకు అమలుచేయడం లేదో సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. బిఆర్ఎస్ పార్టీ హయాంలో అమలులో చేసిన సంక్షేమ పథకాలను చూసి రేవంత్‌రెడ్డి ప్రభుత్వం ఓర్వలేక పోయిందన్నారు. పదేళ్ల తర్వాత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ వసూళ్ల పర్వం చేస్తోందని, ప్రస్తుత రాజకీయ పరిస్థితులను ప్రజలు ఎప్పటికప్పుడు గమనిస్తున్నారని వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో ఈ ప్రభుత్వానికి ప్రజలే కర్రు కాల్చి వాత పెడతారన్నారు. కార్యక్రమంలో కరీంనగర్, హన్మకొండ, సిద్దిపేట జిల్లాల అధ్యక్షులతో పాటు మున్సిపల్ చైర్‌పర్సన్ ఆకుల రజితవెంకన్న, వైస్ చైర్మన్ అయిలేని అనిత శ్రీనివాస్‌రెడ్డి, సిద్దిపేట జిల్లా వైస్ చైర్మెన్ రాయిరెడ్డి రాజారెడ్డి,పార్టీ రాష్ట్ర నాయకులు కర్ర శ్రీహరి, దండుగుల రాజ్యలక్ష్మి,పార్టీ మండల అధ్యక్షులు గంగం మదన్‌మోహన్‌రెడ్డి, పట్టణ అధ్యక్షులు అన్వర్, అక్కన్నపేట మండల అధ్యక్షులు సాంబరాజు, మాజీ ఎంపిపి లకావత్ మానససుభాష్, కొక్కుల కీర్తిసుభాష్, మాలోతు లక్ష్మీబీలునాయక్ పాల్గొన్నారు.



మండల అధ్యక్షునికి నియామకపత్రం అందజేస్తున్న సంఘం నాయకులు

## ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా శ్రీనివాస్

**మర్కుక్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** ఆర్యవైశ్య సంఘం మండల అధ్యక్షుడిగా గ్రామానికి చెందిన గుండా శ్రీనివాస్ రెండోసారి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. మండల కేంద్రంలోని రంగనాయకస్వామి ఆలయ ప్రాంగణంలో మహాసభ సీనియర్ నాయకులు జూలూరి రంగయ్య, సముద్రాల హరినాథ్ చేతులమీదుగా మండల అధ్యక్షుడు గుండా శ్రీనివాస్‌కు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా మండల అధ్యక్షుడు శ్రీనివాస్ మాట్లాడుతూ తనపై నమ్మకంతో రెండోసారి మండల అధ్యక్ష పదవి కట్టబెట్టిన ఆర్యవైశ్య సంఘం పెద్దలకు, సభ్యులకు కృతజ్ఞతలు తెలిపారు. ఆర్యవైశ్య సమాజం బలోపేతం కోసం శక్తివంచన లేకుండా కృషి చేస్తానని, ఆర్యవైశ్యులు సంఘటితంతోనే మన హక్కులను సాధించుకోవచ్చని అన్నారు. ఐక్యమత్యంతో ఉంటూ వాసవి కన్యకాపరమేశ్వరి అనుగ్రహంతో ఆర్యవైశ్యులు అందరూ బాగుండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి అర్థం లక్ష్మణ్, కోశాధికారి బల్లి శ్రీనివాస్, ఉపాధ్యక్షుడు గుడాల అశోక్, ముఖ్య సలహాదారు శ్యాంసుందర్, సహాయ కార్యదర్శి తొడుపునూరి కుమార్, బెల్దె వెంకటేష్, తొడుపునూరి రమేష్, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## ఆర్యవైశ్య సంఘం వర్గల్ మండల అధ్యక్షుడిగా వెంకటయ్య



వెంకటయ్యకు నియామకపత్రం అందజేస్తున్న ఆర్యవైశ్య మహాసభ నేతలు

**వర్గల్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** ఆర్యవైశ్య సంఘం వర్గల్ మండల అధ్యక్షుడిగా బ్రాహ్మండ్లపల్లి వెంకటయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శనివారం వర్గల్‌లో నిర్వహించిన మండల సర్వసభ్య సమావేశంలో సంఘ సభ్యులు అధ్యక్షునిగా వెంకటయ్యను ప్రతిపాదిస్తూ ఏకగ్రీవంగా తీర్మానించగా ఆర్యవైశ్య మహాసభ నేతలు హరినాథ్‌గుప్త, రంగయ్యగుప్తలు ఆయనకు నియామకపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నూతన అధ్యక్షునిగా ఎన్నికైన వెంకటయ్యను ఘనంగా సన్మానించారు. అనంతరం వెంకటయ్య మాట్లాడుతూ త్వరలోనే ప్రమాణ స్వీకార మహోత్సవం ఉంటుందని, తనపై నమ్మకంతో మూడోసారి అధ్యక్ష బాధ్యతలు అప్పగించడం సంతోషంగా ఉందన్నారు.

## ఆచార్య కొండా లక్ష్మణ్ వర్ధంతి వేడుకలు




కొండా లక్ష్మణ్ బాపూజీకి నివాళులుర్పిస్తున్న ఎమ్మెల్యే జీఎంఆర్

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త:** స్వాతంత్ర సమరయోధుడు తొలి, మలి దశ తెలంగాణ ఉద్యమకారుడు, ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని పటాన్‌చెరు నియోజకవర్గం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని బస్టాండ్ ప్రాంగణంలోనిగల ఆచార్య కొండా లక్ష్మణ్ బాపూజీ కాంస్య విగ్రహానికి పూలమాల వేసి ఘన నివాళ్ళు అర్పించిన ఎమ్మెల్యే గూడెం మహిపాల్‌రెడ్డి తెలంగాణ ప్రజలకు ఆయన చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో మార్కెట్ కమిటి మాజీచైర్మన్ విజయ్ కుమార్, కాంగ్రెస్ పార్టీ డివిజన్ అధ్యక్షులు నరసింహారెడ్డి, సీనియర్ నాయకులు గూడెం మధుసుధన్‌రెడ్డి, మార్కెట్ కమిటి మాజీ డైరెక్టర్ వంగరి అశోక్, కంకర సీనయ్య పాల్గొన్నారు.

## విద్యా వ్యవస్థను గాలికొదిలేసిన కాంగ్రెస్ ప్రభుత్వం

**-బిఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి**

**గజ్వేల్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** రాష్ట్రంలో విద్యా వ్యవస్థను కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా గాలికొదిలేసిందని, గురుకుల పాఠశాలల వ్యవస్థను అస్తవ్యస్తంగా మార్చారని బిఆర్ఎస్ పార్టీ గజ్వేల్ నియోజకవర్గ ఇంచార్జ్ వంటేరు ప్రతాప్‌రెడ్డి ఆరోపించారు. శనివారం గజ్వేల్‌లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ గురుకుల పాఠశాలల్లో చదువుకునే విద్యార్థిని, విద్యార్థులకు కనీసం భోజనం పెట్టలేని స్థితిలో ఉన్న కాంగ్రెస్ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వెంటనే రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. దోమల వల్ల విద్యార్థులు విషజ్వరాలు వచ్చి అలమటిస్తున్నారని మండిపడ్డారు. విద్యార్థులకు కనీస వసతులు కల్పించడంతో కాంగ్రెస్ ప్రభుత్వం విఫలమైందన్నారు. సంక్షేమ హాస్టళ్ల నిర్వహణకు పైసలు లేవని చెప్పడం విడ్డూరంగా ఉందన్నారు. సంక్షేమ హాస్టళ్లలో అప్పులుచేసి సరుకులు తెస్తున్న వార్డెన్లకు తలకు మించిన భారంగా ఉందన్నారు. ప్రస్తుతం వార్డెన్లు సైతం చేతులెత్తేసే పరిస్థితి ఉందన్నారు. ఇప్పటికైనా కాంగ్రెస్ ప్రభుత్వం కళ్లు తెరిచి పెండింగ్‌లో ఉన్న బిల్లులను విడుదల చేయడంతో పాటు గురుకుల పాఠశాలల్లో చదువుతున్న పేద విద్యార్థులకు నాణ్యమైన భోజన సదుపాయాలను కల్పించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో విద్యార్థులతో కలిసి మరో ఉద్యమాన్ని నిర్వహిస్తామని హెచ్చరించారు.



మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

## అర్థం పర్థం లేకుండా విమర్శలు చేస్తే చూస్తూ ఊరుకోం

**కొమురవెల్లి, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త :** కమ్యూనిస్టు నాయకుడు ఆముదాల మల్లారెడ్డి మార్క్సిస్టు సిద్ధాంతాన్ని వదిలేసి వ్యక్తిగత విమర్శలు చేసే స్థాయికి దిగజారి జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి మెప్పుకోసం ప్రజా సమస్యలను గాలికి వదిలేస వ్యక్తిగత విమర్శలు చేస్తున్నారని సనాది భాస్కర్, లింగంపల్లి శ్రీనివాస్, చెరుకు రమణారెడ్డి అన్నారు. శనివారం కొమురవెల్లిలో విలేకరులతో మాట్లాడారు. జనగామ డీసీసీ అధ్యక్షులు, మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాప్‌రెడ్డిపై అర్థం, పర్థం లేకుండా ఆరోపణలు, విమర్శలు చేస్తే చూస్తూ ఉరుకోమని హెచ్చరించారు. ఈ ప్రాంత అభివృద్ధికి కృషి చేస్తున్న ప్రతాప్‌రెడ్డిపై విమర్శలు చేయడం సిగ్గుచేటన్నారు. మల్లారెడ్డి వెంటనే భేషరతుగా క్షమాపణ చెప్పాలన్నారు. సమావేశంలో పార్టీ నాయకులు బుడిగే బిక్షపతి, లింగపల్లి కనకరాజు, మల్లం బాలయ్య, పిఎసిఎస్ డైరెక్టర్ బత్తిని నర్సింలు, కాయిత మోహన్‌రెడ్డి, తురాయి నవీన్, జనగాం శ్రీకాంత్, నర్సింలు, దొడ్ల విష్ణుమూర్తి, చింతల పర్శరాములు, బొచ్చు ఎల్లయ్య, ఎర్రుల రాజు, బొచ్చు రాజు, పుట్ట రమేష్, ఉప్పల వంశీకృష్ణ, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం రేషలైజేషన్ జీవోను ఉపసంహరించుకోవాలి



మాట్లాడుతున్న టిపిటిఎఫ్ నాయకులు

**మిరుదొడ్డి, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ప్రాథమిక పాఠశాలలను నిర్వీర్యం చేసేలా ఇటీవల ప్రభుత్వం విడుదల చేసిన రేషలైజేషన్ జీవోను తక్షణమే ఉపసంహరించుకోవాలని టిపిటిఫ్ మండల అధ్యక్షులు అందె రామచంద్రం, అక్బర్‌పేట-భూంపల్లి మండల అధ్యక్షులు పెరుమాండ్ల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శి ర్యాకం మల్లేశం, రాజయ్య, నాగరాజు, రవిశేఖర్, దయాసాగర్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శనివారం వారు మాట్లాడుతూ, ఉన్నత పాఠశాలల మాదిరిగానే ప్రతి ప్రాథమిక పాఠశాలకు తరగతికి ఒక ఉపాధ్యాయున్ని, ఒక హెచ్‌ఎంను కేటాయించాలన్నారు. సింగిల్ లేదా డబుల్ టీచర్ల పాఠశాలల వ్యవస్థను పూర్తిగా రద్దుచేయాలన్నారు. 30 మంది విద్యార్థులకు ఒక టీచర్‌ను మాత్రమే కేటాయించడం పట్ల పాఠశాలలో విద్యాబోధన కుంటుపడుతుందన్నారు. బడుగు బలహీన వర్గాల పిల్లలను ప్రభుత్వం విద్యకు దూరం చేసేలా పని చేస్తుందన్నారు. తరగతుల సంఖ్యను బట్టి ఉపాధ్యాయులను కేటాయించినప్పుడే ప్రాథమిక విద్యా వ్యవస్థ మెరుగుపడుతుందన్నారు.

## తప్పిపోయిన బాబును తల్లిదండ్రులకు అప్పగింత

**సిద్దిపేట అర్బన్, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త :**

ఆర్టీసి బస్సులో తల్లిదండ్రులనుంచి తప్పిపోయిన బాబును సిద్దిపేట పాత బస్టాండులో దిగిన బాలున్ని గుర్తించి సిద్దిపేట పోలీసు కంట్రోల్ రూమ్ సిబ్బంద తల్లిదండ్రులకు శనివారం అప్పగించారు. కంట్రోల్ రూం ఇన్స్‌పెక్టరన మల్లేశంగౌడ్ అందించిన వివరాలు ఇలా ఉన్నాయి. మధ్యాహ్నం పాత బస్టాండులో ఓ మహిళ తన తల్లి అనుకొని దిగిన నాలుగు సంత్సరాల బాలుడు, తల్లిదండ్రులు సిరిసిల్ల నుంచి సికింద్రాబాద్ వెళ్లడానికి వేములవాడ డిపో బస్సులో ప్రయాణిస్తున్నారని తెలిపారు. మార్గమధ్యలో సిద్దిపేట పాత బస్టాండులో బస్సు ఆగగానే పిల్లవాడు ఒక మహిళతో కిందికి దిగినాడు. అది చూసుకొని తల్లిదండ్రులో బస్సులో వెళ్లిపోయారు. పిల్లవాడు ఆ మహిళ దగ్గర ఉండి ఏడ్చుచుండగా పక్కనే ఉన్న ఆటో డ్రైవర్ డయల్ 100కు కాల్ చేసి తప్పిపోయిన బాలుడు ఏడుస్తున్నాడని చెప్పగానే కంట్రోల్ రూం సిబ్బంది అప్రమత్తమై వెంటనే వేములవాడ డిపో మేనేజర్‌కు ఫోన్ చేయగా బస్సు కండక్టర్ ఫోన్ నంబర్ ఇవ్వగానే వెంటనే ఫోన్ చేసి బస్సులో ఉన్న తల్లిదండ్రులకు మీ బాబు ప్రస్తుతం సిద్దిపేట పాత బస్టాండులో ఉన్నాడని తెలియజేశారు. వెంటనే తల్లిదండ్రులు పాత బస్టాండుకు చేరుకోని తప్పిపోయిన బాబు తమే బాబేనని వివరాలు తెలపడంతో బాబును తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించారు. బాబును అప్పగించిన పోలీసులకు తల్లిదండ్రులు కృతజ్ఞతలు తెలిపారు. తప్పిపోయిన బాబును పట్టుకొని తల్లిదండ్రులకు క్షేమంగా అప్పగించిన కంట్రోల్ రూం సిబ్బందిని సీపీ డా॥అనురాధ అభినదించారు. త్వరలోనే రివార్డు అందజేస్తామన్నారు. ఎక్కడ ఇబ్బంది వచ్చిన వెంటనే డయల్ 100కు ఫోన్ చేయాలన్నారు.



తప్పిపోయిన బాబును తల్లిదండ్రులకు అప్పగిస్తున్న దృశ్యం



లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను అందజేస్తున్న దృశ్యం

## గ్యాస్ సబ్సిడీ పత్రాల అందజేత

**నంగునూర్, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** మండల పరిధిలోని వెంకటాపూర్‌లో కాంగ్రెస్ ప్రభుత్వం ప్రవేశపెట్టిన మహాలక్ష్మీ పథకం ద్వారా గ్యాస్ లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ పత్రాలను శనివారం కాంగ్రెస్ పార్టీ మండల పార్టీ అధ్యక్షులు రంగు అశోక్‌గౌడ్ చేతుల మీదుగా అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం పేదల సంక్షేమమే ధ్యేయంగా ముందుకు సాగుతుందన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేసి పేదలకు న్యాయం చేస్తుందన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు సందెబోయిన తిరుపతి యాదవ్, నర్సింలు, నారాయణరెడ్డి. పంచాయతీ కార్యదర్శి హర్షద్, ఉపాధి హామీ ఫీల్డ్ అసిస్టెంట్ జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## ప్రతి ఒక్కరూ మొక్కలు నాటాలి : ప్రిన్సిపాల్

**హుస్నాబాద్ టౌన్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ కనీసం ఒక మొక్కను నాటాలని ప్రిన్సిపాల్, ఎన్ఎస్ఎస్ చైర్మన్ కందుల శోభాదేవి అన్నారు. శనివారం పట్టణంలోని బాలికల కళాశాలలో జాతీయ సేవా పథకం (ఎన్ఎస్ఎస్) ఆధ్వర్యంలో స్వచ్ఛత హి సేవా కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో పెరిగిన పిచ్చి మొక్కలను తొలగించారు. అనంతరం మొక్కలు నాటి మాట్లాడుతూ వాతావరణంలో కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో వచ్చే తరాలకు స్వచ్ఛమైన గాలి అందలంటే కచ్చితంగా ప్రతీ ఒక్కరు మొక్కలు నాటడంతో పాటు నాటిన ప్రతీ మొక్కను సంరక్షించుకోవాలన్నారు.ఈ కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ కర్ణాకర్‌తో పాటు అధ్యాపక బృధం పాల్గొన్నారు.

## గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలి

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** మండలంలోని గ్రామ పంచాయతీలకు నిధులు మంజూరు చేయాలని ఆయా గ్రామపంచాయతీల కార్యదర్శులు శనివారం ఎంపిడిఓ బి.యాదగిరి, ఎంపిఓ ఎండి.ఖాజా మొహినొద్దీన్‌లకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గ్రామ పంచాయతీల్లో కనీస మౌలిక వసతులు ప్రజలకు కల్పించేందుకు నిధులు లేవని, రాబోయే రోజుల్లో బతుకమ్మ, దసరా పండుగలు సమీపిస్తున్నందున సంబరాల కోసం ఏర్పాట్లు చేసేందుకు, అదేవిధంగా గ్రామంలోని విద్యుద్దీకరణ, పారిశుద్ధ్య పనులను నిర్వహించడానికి గ్రామ పంచాయతీల్లో ఎలాంటి నిధులులేవని, ఇప్పటికే ఆయా గ్రామ పంచాయతీల్లో పంచాయతీ కార్యదర్శులము అయిన మేము తమ జీతం నుండి ఖర్చు చేస్తున్నామని అన్నారు. పారిశుధ్య కార్మికులకు, గ్రామపంచాయతీ సిబ్బంది సరైన సమయంలో వేతనాలు అందించలేకపోతున్నామని, ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేయాలని కోరారు. పంచాయతీల్లో నెలకొన్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్ళాలని ఎంపిడిఓ, ఎంపిఓలను కోరుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు ప్రవీణ్, సతీష్, హరీష్, సంతోష్‌కుమార్, నాగరాజు, మమత, ప్రవీణ్, నరేష్‌రెడ్డి, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## బదిలీ అయిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలి

**-ఎస్‌జిటియు మండల అధ్యక్షుడు అంకం వెంకటేశ్వర్లు**

**జగదేవ్‌పూర్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** ప్రభుత్వం ఇటీవల బదిలీ చేసిన ఉపాధ్యాయులను వెంటనే స్థాన చలనం కలిగించాలని ఎస్‌జిటియు జగదేవ్‌పూర్ మండల అధ్యక్షుడు అంకం వెంకటేశ్వర్లు, ప్రధాన కార్యదర్శి రాజేందర్‌లు అన్నారు. శనివారం జగదేవ్‌పూర్‌లోని ఎంఆర్‌సి కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం తీసుకొచ్చిన ఉపాధ్యాయుల సర్దుబాటు ప్రక్రియ కంటే ముందుగానే ఇటీవల బదిలీ కాబడిన ఉపాధ్యాయులను వెంటనే రిలీవ్ చేయాలని, అదేవిధంగా ప్రతి ప్రాథమిక పాఠశాలకు ఐదుగురు ఉపాధ్యాయులను, ఒక ప్రధానోపాధ్యాయుడు అందేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్‌జిటియు జిల్లా ప్రధాన కార్యదర్శి వేణు, మహిళా కార్యదర్శులు సంతోషికుమారి, ఎస్తేర్ రాణి, కవిత, మాధవి, కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## కంకర క్రషర్లను క్వారీల అనుమతులను రద్దు చేయాలి



సీఎం రేవంత్‌రెడ్డి గృహం వద్ద రాళ్ళకత్వ గ్రామస్తులు

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 21,ప్రభాతవార్త:** సంగారెడ్డి జిల్లా జిన్నారం మండలం రాళ్లకత్వ గ్రామశివారులో సర్వేనెంబర్ 286లో రైతులకు ఇచ్చిన అసైన్డ్ భూముల్లో నూతనంగా కంకర క్వారీ క్రషర్ల పనులు కొనసాగుతుండటంతో ప్రజలు హైదరాబద్‌లో ముఖ్యమంత్రి నివాసంలో కలిసి కంకర క్రషర్స్ ద్వారా ప్రమాదకర సమస్యలను, గ్రామ సమస్యలను వివరిస్తూ, తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ద్వారా కంకర క్వారీ క్రషర్స్ అనుమతులను రద్దు చేసి క్రషర్‌సను తోలగించి పలు గ్రామాలకు న్యాయం చేయాలని కోరారు. గతంలో ప్రజాభిప్రాయ సేకరణలోను పూర్తిగా వ్యతిరేకించినప్పటికి క్రషర్ యజమానులు చట్ట విరుద్దంగా నిబంధనలను ఉల్లంఘించి రైతులకు పంట పొలాలను చెరువుకుంటలను పాడి పంటలకు తీవ్రమైన నష్టం వాటిల్లే విధంగా పని చేస్తున్నారని, అలాగే ప్రజల ఆరోగ్యాలపైన తీవ్ర నష్టం జరుగుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే నిర్మాణ పనులు పూర్తిగా తొలగించాలని ఇచ్చినా అనుమతులను ప్రభుత్వం ద్వారా రద్దుపర్చి చుట్టు ప్రక్కల గ్రామాల పంట పొలాలను చెరువు కుంటలను కాపాడాలని, ప్రజల ఆరోగ్యాలను దృష్టిలో పెట్టుకొని మాగ్రామాలకు తగు న్యాయం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో రాళ్లకత్వ గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం

**మర్కుక్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):** మర్కుక్ మండలం పాములపర్తి గ్రామంలోని ఎస్సీ కాలనీకి చెందిన రాజంగారి కిష్టమ్మ ఇటీవల మరణించగా విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ మండల బిసిసెల్ అధ్యక్షుడు మ్యాకల కనకయ్య ముదిరాజ్ శనివారం బాధిత కుటుంబాన్ని పరామర్శించి ఆర్థిక సహాయం అందించారు. ఆయన వెంట బోయిని ప్రభాకర్, మల్లేశం, నర్సింలు, బాలేష్, నర్సింలు తదితరులు ఉన్నారు.

## కొండా లక్ష్మణ్ బాపూజీ సేవలు చిరస్మరణీయం

**ములుగు, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):**

స్వర్గీయ కొండా లక్ష్మణ్ బాపూజీ తెలంగాణ రాష్ట్రం కోసం చేసిన సేవలు చిరస్మరణీయమని కొండా లక్ష్మణ్ విశ్వవిద్యాలయ ఉప కులపతి నీరజ ప్రభాకర్ పేర్కొన్నారు. శనివారం కొండా లక్ష్మణ్ బాపూజీ వర్ధంతిని పురస్కరించుకొని ములుగు మండలకేంద్రంలోని ఆర్టికల్చర్ యూనివర్సిటీ ప్రధాన కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో విశ్వవిద్యాలయ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



కొండా లక్ష్మణ్ బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న దృశ్యం



మాట్లాడుతున్న సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ

## లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకోవాలి

### -సీనియర్ సివిల్ జడ్జీ సూరి కృష్ణ

**జహీరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** సెప్టెంబరు 28వ తేదీన నిర్వహించే లోక్ అదాలత్‌ను కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా పోలీసు అధికారులు, బ్యాంక్ అధికారులు, న్యాయవాదులు కృషిచేయాలని సీనియర్ సివిల్ జడ్జి సూరికృష్ణ పేర్కొన్నారు. శనివారం పట్టణంలోని కోర్టులో బ్యాంక్, పోలీసు అధికారులు, న్యాయవాదులతో సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా న్యాయమూర్తి సూరి కృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో కేసును పరిష్కరించుకుంటే కలిగే ప్రయోజనాలపై కక్షిదారులకు అవగాహన కల్పించాలన్నారు. ప్రత్యేక రాయితీల ద్వారా బ్యాంక్ రుణాలను వన్ టైం సెటిల్‌మెంట్ పద్ధతిలో పరిష్కరించుకునేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. లోక్ అదాలత్‌పై ఏ సందేహాలు ఉన్నా మండల లీగల్ సర్వీసెస్ కమిటీని సంప్రదించాలని సూచించారు. సమావేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, న్యాయవాదులు, బ్యాంక్ అధికారులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగ్ వలంటీర్లు పాల్గొన్నారు.

## పంచాయతీ కార్మికులకు వేతనాలు చెల్లించాలి


ఎంపిడిఓకు వినతిపత్రం అందచేస్తున్న సిఐటియు నాయకులు

**మనూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** గ్రామ పంచాయతీ కార్మికులకు అందచేయాల్సిన బకాయి వేతనాలను చెల్లించాలని డిమాండ్‌చేస్తూ శనివారం సిఐటియు నాయకులు ఎంపిడిఓ అలివేలు మంగకు వినతి పత్రం అందచేశారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్‌కార్యదర్శి రమేష్ మాట్లాడుతూ మండల పరిధిలోని కొన్ని గ్రామ పంచాయతీ కార్మికులు రెండు నుంచి 4 నెలల వేతాలను చెల్లించాల్సి ఉందన్నారు. కార్మికులకు నెలనెల వేతనాలు రాకుంటే కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రశ్నించారు. వేతనాలు అందక కార్మికుల కుటుంబాలు పస్తులుండాల్సిన దుస్థితి దాపురించిందని ఆందోళన వ్యక్తం చేశారు. కార్మికులకు ప్రతి నెల వేతనాలు అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్మికులకు బకాయి వేతనాలతో పాటు కాస్మోటిక్ సరుకులు వెంటనే అందచేయాలన్నారు. పెరిగిన ధరలకు అనుగుణంగా కార్మికులకు నెలకు రూ. 18వేల వేతనాలను అందచేయాలని రమేష్ ప్రభుత్వానికి డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సిఐటియు నాయకులు అంజయ్య, నర్సింలు, సంజీవులు తదితరులు ఉన్నారు.

## బాల్య వివాహాలు చేయొద్దు: పంచాయతీ కార్యదర్శి

**సిర్గాపూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** బాల్య వివాహాలు చేసి పిల్లల బంగారు భవితను బూడిదలో పోసిన పన్నీరులా చేయవద్దని పంచాయతీ కార్యదర్శి నవీన్‌రెడ్డి సూచించారు. శనివారం సిర్గాపూర్‌లోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో బాలల పరిరక్షణ కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమానికి పోలీసు సిబ్బంది, అంగన్‌వాడి టీచర్లు, యువకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నవీన్‌రెడ్డి మాట్లాడూ బాల్య వివాహాలు చేస్తే కలిగే కష్టనష్టాలపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలు జరుగుతున్నట్లు తెలిస్తే పంచాయతీ కార్యాలయలో, రెవెన్యూ, పోలీసు అధికారులకు సమాచారం అందించాలని, సమాచారం ఇచ్చిన వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని నవీన్‌రెడ్డి సూచించారు.

## కామారెడ్డి డిక్లరేషన్‌ను అమలు చేయాలి

**పాపన్నపేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ రథసారధి రేవంత్‌రెడ్డి కామారెడ్డి డిక్లరేషన్ ప్రకారం బీసీలకు రిజర్వేషన్‌ను 42శాతం పెంచిన తర్వాతే స్థానిక సంస్థల ఎన్నికల నోటిఫికేషన్ జారీ చేయాలని డిమాండ్ చేస్తూ శనివారం మెదక్ మాజీ ఎమ్మెల్యే పట్లోళ్ల శశిధర్‌రెడ్డి ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి బహిరంగ లేఖ రాశారు. రాష్ట్రంలో అధికారంలోకి వచ్చి 8 నెలలు గడుస్తున్నా ఇంత వరకు రాష్ట్రం ఫీజు బకాయిలను చెల్లించలేదని, ప్రభుత్వం వెంటనే బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్తంగా 4500 కోట్ల రూపాయల ఫీజ్ బకాయిలు ఉందని గుర్తు చేశారు. ఫీజు బకాయిలు చెల్లించకపోవడంతో కళాశాలల యాజమాన్యాలు విద్యార్థులకు సర్టిఫికెట్లు అందించడం లేదని, ఫలితంగా విద్యార్థులు పడుతున్న పాట్లు చెప్పనలవిగా ఉన్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకుపోతున్నట్లు మాజీ ఎమ్మెల్యే శశిధర్‌రెడ్డి పేర్కొన్నారు.

## ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలి

**రామాయంపేట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ఎయిడ్స్ పట్ల ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని స్థానిక ప్రభుత్వ ఆసుపత్రి ల్యాబ్ టెక్నీషియన్ ఆంజనేయులు చెప్పారు. శనివారం రామాయంపేట ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎయిడ్స్ నివారణపై విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎయిడ్స్ వ్యాధిపై ప్రతి ఒక్కరికి అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విచ్చలవిడి లైంగిక సంపర్కాలకు దూరంగా ఉండాలని సూచించారు. ఎయిడ్స్ నివారణ కోసం తీసుకోవలసిన జాగ్రత్తలను ఆయన తెలియజేశారు. ప్రతి విద్యార్థికి ఎయిడ్స్ పై అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. పాఠ్యాంశంలో ఎయిడ్స్ ఒక భాగమని చెప్పారు. వివాహానికి ముందు ప్రతి ఒక్కరూ ఎయిడ్స్ పరీక్షలు చేసుకోవాలని ఆయన కోరారు. ప్రతి విద్యార్థి ఎంతో అప్రమత్తంగా ఉండి సమాజంలో కష్టపడి చదువుకొని ముందుకు పోవాలని సూచించారు. కార్యమ్రంలో కళాశాల ప్రిన్సిపాల్ హిమజ్యోతి, వైస్ ప్రిన్సిపాల్ మల్లేశం, వైద్య సిబ్బంది రవి, కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## ఆర్ట్స్ కాలేజీలో ఉద్యోగ అవకాశాలపై సదస్సు

**మెదక్ మున్సిపాలిటీ, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** మెదక్ ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ఆర్ట్స్ ప్రాంగణంలో సామాజిక శాస్త్రాల విభాగం ఆధ్వర్యంలో శనివారం కెరీర్ గైడెన్స్‌పై ఇండిగో ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ఇంజనీర్ అయిన మహితా మేడం దశ దిశ బంగారు భవిష్యత్తు అను అంశంపైన కెరీర్ గైడెన్స్‌లో భాగంగా అమూల్యమైన సలహాలు, సూచనలు అందించారు. పోటీ పరీక్షల్లో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగ అవకాశాలు పొందే విధానం పైన సమగ్రంగా విద్యార్థులకు వివరించారు. మల్టీ నేషనల్ కంపెనీ, కార్పోరేట్ కంపెనీల్లో ఉద్యోగ అవకాశాలు పొందుటకు కావలసిన నైపుణ్యాలను వివరించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హుస్సేన్, లెక్చరర్లు గణపతి, డా. రాజాగౌడ్, డా. అరుంధతి, వెంకటేశ్వర్లు, నాగరాజు, దేవదాస్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఇండిగో ఎయిర్‌లైన్స్ ఫ్లైట్ ఇంజనీర్ మహిత

# ఇచ్చిన మాట నిలబెట్టుకున్న కాంగ్రెస్ ప్రభుత్వం

**కొల్చారం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:**

మాట ఇచ్చి నిలబెట్టుకున్నది కాంగ్రెస్ ప్రభుత్వం అని మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్ అన్నారు. మహిళల పట్ల అపారమైన గైరవ మర్యాదలు ఉన్న ఏకైక పార్టీ కాంగ్రెస్ పార్టీ అని, ఆరు గ్యారెంటీల హామీతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ వాటిని అమలు పరిచే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి సారథ్యంలో ముందుకు వెళ్తున్న సందర్భంలో కొల్చారం మండలానికి 5700 గ్యాస్ సబ్సిడీ బాండ్లు విడుదల కావడం జరిగిందన్నారు. ఆ బాండ్లను మండల వ్యాప్తంగా అన్ని గ్రామపంచాయతీ కార్యాలయంలో లబ్ధిదారులకు, మహిళలకు పంచాయతీ కార్యదర్శి అక్కడున్న గ్రామస్థాయి కాంగ్రెస్ పార్టీ నాయకుల ఆధ్వర్యంలో అందించడం జరుగుతుందన్నారు. ఇందులో భాగంగా మండల పరిధిలోని కిష్టాపూర్ గ్రామ పంచాయితీ కార్యాలయంలో శనివారం గ్రామానికి మంజూరైన 216 గ్యాస్ సబ్సిడీబాండ్లను లబ్ధిదారులకు గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పెద్ది శ్రీశైలం ఆధ్వర్యంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్‌ల చేతుల మీదుగా అందించడం జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మాట ఇచ్చి నిలబెట్టుకున్న రేవంత్‌రెడ్డి రెడ్డి సారథ్యంలోని కాంగ్రెస్ ప్రభుత్వం పట్ల మహిళలు సంతోషం వ్యక్తం చేయడం జరిగింది. గత ప్రభుత్వాలు కల్లబొల్లి మాటలతో కాలం వెల్లదీశాయని, నేడు ఈ ప్రభుత్వం చేపడుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను తప్పుదోవ పట్టించాలని లేనిపోని ఆరోపణలుచేస్తున్నారన్నారు. ఇది కూతల ప్రభుత్వం కాదని, చేతల ప్రభుత్వమని రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరూపించిందన్నారు. రాబోవు కాలంలో మిగిలిన గ్యారెంటీలను అమలు పరిచే దిశగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి నాయకత్వంలో కాంగ్రెస్ పార్టీ నిరుపేదలకు అండగా ఉంటుందని తెలిపారు. రాబోవు కాలంలో స్థానిక సమరంలో కాంగ్రెస్ పార్టీ జెండా ఎగరవేసే దిశగా కొల్చారం మండల కాంగ్రెస్ పార్టీ పనిచేస్తుందన్నారు. ఖబడ్దార్ ప్రతిపక్ష నాయకుల్లారా.. సహాయం చేసేందుకు చేతగాక చేసే ప్రభుత్వాన్ని, చేసిన సహాయాన్ని కూడా తప్పుదోవ పట్టిస్తూ ప్రజలను అయోమయానికి గురిచేయవద్దని ఈ సందర్భంగా హెచ్చరిస్తున్నామన్నారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీసుకునే ప్రతి నిర్ణఆనికి ప్రజల నుంచి విశేష స్పందన లభించడం జరుగుతుందని, అట్టి స్పందన చూసి జీర్ణించుకోలేని ఈ బీఆర్ఎస్ నాయకులు లేనిపోని ఆరోపణలు చేయడం జరుగుతుందన్నారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నాగులగారి మల్లేశంగౌడ్, కిష్టాపూర్ గ్రామ శాఖ అధ్యక్షులు పెద్ది శ్రీశైలం, సీనియర్ నాయకులు బసన్నగారి నర్సాపూర్ పెద్ది శ్రీనివాస్, పీఏసీఎస్ చైర్మన్ చాకలి ప్రభాకర్, యాదగిరి, పంచాయతీ కార్యదర్శి మమత, సిబ్బంది, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నాగులగారి మల్లేశంగౌడ్


లబ్ధిదారులకు గ్యాస్ సబ్సిడీ బాండ్లను అందజేస్తున్న దృశ్యం



ప్రజలకు పరిశుభ్రతపై అవగాహన కల్పిస్తున్న అధికారులు

## పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి

**రామాయంపేట మున్సిపాలిటీ, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త :** ప్రతి ఒక్కరూ తమ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని మున్సిపల్ అధికారులు సూచించారు. శనివారం రామాయంపేట మున్సిపాలిటీలోని 4వ వార్డు పరిధిలోని బిసి కాలనీలో "స్వచ్ఛతా హీ సేవా" కార్యక్రమంలో భాగంగా ప్రజలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు ప్రజలకు పలు సూచనలు చేశారు. ముఖ్యంగా మహిళలు తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి ఒక్కరు విధిగా తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకున్నట్లైతే తద్వారా తమ కాలనీ, తమ పట్టణం పరిశుభ్రంగా ఉంటుందన్నారు. కార్యక్రమంలో వార్డు అధికారులు శిరీష, నవనీత, సిబ్బంది బల్ల శ్రీనివాస్, పద్మ, మనోజ్, వార్డు మహిళలు పాల్గొన్నారు.

## ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి


శేఖాపూర్ ఉర్సు ఉత్సవాల్లో పాల్గొన్న చైర్మన్ గిరిధర్‌రెడ్డి

**జహీరాబాద్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని శేఖాపూర్‌లో నిర్వహిస్తున్న ఉర్సు ఉత్సవాల్లో రాష్ట్ర సెట్విన్ కార్పోరేషన్ చైర్మన్ గిరిధర్ రెడ్డి, పార్లమెంట్ కాంగ్రెస్ నాయకులు డాక్టర్ ఉజ్వల్‌రెడ్డిలు పాల్గొని దర్గా వద్ద ప్రత్యేక ప్రార్థనలు చేశారు. ఉత్సవాలకు చేరుకున్న నాయకులను ఉత్సవ కమిటి బాధ్యులు సాదరంగా స్వాగతం పలుకగా గిరిధర్‌రెడ్డి, ఉజ్వల్‌రెడ్డిలు దర్గాకు దట్టీ సమర్పించారు. కార్యక్రమంలో దర్గా ఉత్సవ కమిటి బాధ్యులు, కాంగ్రెస్ నాయకులు, ఆయా గ్రామాల మాజీ ప్రజాప్రతినిధులు, యూత్ కాంగ్రెస్ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలి : ప్రిన్సిపాల్


ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థుల సంస్కృతి ప్రదర్శన

**పాపన్నపేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** విద్యార్థులు లక్ష్యసాధనకు నిరంతరం కృషి చేయాలని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ నర్సింలు అన్నారు. శనివారం మండల కేంద్రమైన పాపన్నపేటలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఫ్రెషర్స్ డేను ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ విద్యార్థులు క్రమ శిక్షణతో విద్యను ఆర్జించాలన్నారు. నిత్యం క్రమం తప్పకుండా కళాశాలకు హాజరు కావాలన్నారు. కళాశాల రెండవ సంవత్సరం విద్యార్థులు మొదటి సంవత్సరం విద్యార్థులను ఆహ్వానించిన కార్యక్రమాన్ని పురస్కరించుకుని ఆటలు, పాటలతో విద్యార్థులు ఆనందంగా గడిపారు. కార్యక్రమంలో లెక్చరర్లు శ్రీనివాస్, సతీష్, ప్రవీణ్ కుమార్, సంతోష్, శ్రీనివాస్, రమేష్, సంధ్యారాణి, అరుణ, విజయ్, రాములు, వందన, రాజు, జగదీష్, నారాయణ, విద్యార్థులు పాల్గొన్నారు.

## భారత సమ్మిళితాభివృద్ధికి మనవంతు చేయూతనిద్దాం

**పటాన్‌చెరు, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:**

భారతదేశం కోసం సమగ్ర విధానాలను రూపొందించి, దేశ సమ్మిళితాభివృద్ధికి మనవంతు చేయూతనిద్దామని పలువురు వక్తలు అభిప్రాయపడ్డారు. కౌటిల్యా స్కూల్ ఆఫ్ పబ్లిక్ పాలసీ ద్వైవార్షిక కొలాక్వీలో భాగంగా శనివారం భారతదేశం కోసం సమగ్ర విధానలు అనే అంశంపై ముఖాముఖి చర్చలను నిర్వహించి ఈ కార్యక్రమంలో విభిన్న రంగాలకు చెందిన ప్రభుత్వ, ప్రభుత్వేతర నిపుణులు ఉన్నతాధికారులు పాల్గొని ఆయా అంశాలపై తనదైన శైలిలో పరిష్కార మార్గాలు చూపడంతో పాటు పలు సూచనలు చేశారు. తొలుత ఈ కార్యక్రమాన్ని పబ్లిక్ పాలసీలో మహిళలు, ఆర్థిక రంగ భవిష్యత్తు, డిజిటల్ పాలన, వాతావరణ మార్పులు, పర్యావరణ-సామాజీక పాలన అనే అంశాలు కౌటిల్యా పబ్లిక్ పాలసీ విద్యార్థులు పత్ర సమర్పణ చేశారు. తరువాత ఆయా ప్రత్యేక అంశాలపై విడివిడి ముఖాముఖి చర్చలు నిర్వహించారు. ఆర్థిక రంగ భవిష్యత్తుపై నిర్వహించిన చర్చలో డాక్టర్ రతిన్ రాయ్ చేజ్ ఇండియా ఉపాధ్యక్షుడు కౌశల్ మహన్, ఐఆర్ఎస్ పూర్వ అధికారి షర్మిలా చావలీ పాల్గొన్నారు. వాతావరణ మార్పులపై జరిగిన చర్చలో అశోక్ లేలాండ్ కార్పొరేట్ స్ట్రాటజీ హెడ్ అలోక్ వర్మ, సంబోధి డిప్యూటీ ఉపాధ్యక్షుడు అభిషేక్ శర్మ, గ్రాంట్ థార్న్ టన్ భారత్ ఎల్‌ఎల్‌పీ డైరెక్టర్ మోహన్ కుమార్ పాల్గొన్నారు. అప్పటికే ఆయా అంశాలపై పత్ర సమర్పణ చేసిన విద్యార్థులు నిపుణుల అభిప్రాయాలను అసాంతం ఆలకించడంతో పాటు పలు సందేహాలను అడిగి నివృత్తి చేసుకున్నారు.


ఆసుపత్రి ఎదుట ఆందోళన చేస్తున్న సిఐటియు నేతలు

విద్యుత్ షాక్‌తో మృతిచెందిన లక్ష్మన్ కుటుంబాన్ని ఆదుకోవాలంటూ

## సిఐటియు ఆధ్వర్యంలో ఆసుపత్రి ఎదుట ధర్నా

జోగిపేట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త: విద్యుత్ షాక్‌తో మృతిచెందిన మండల పరిధిలోని తాలెల్మ గ్రామపంచాయితీ కార్మికుడు లక్ష్మన్ కుటుంబాన్ని ఆదుకోవాలని డిమాండ్ చేస్తూ అతని కుటుంబ సభ్యులతో కలిసి సిఐటియు ఆధ్వర్యంలో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రి ముందర శనివారంనాడు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు డివిజన్ కార్యదర్శి డి.విద్యాసాగర్ మాట్లాడుతూ లక్ష్మన్ మృతిచెంది ఒకరోజు గడుస్తున్నా అధికారులు పట్టించుకోవటంలేదని విమర్శించారు. మృతుడి కుటుంబానికి రూ.50లక్షలు ఎక్స్‌గ్రేషియాఆ చెల్లించాలని, కుటటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కాగా అధికారులు ఆసుపత్రి వద్దకు వచ్చి విద్యుత్‌శాఖ నుంచి ఐదు లక్షలు, గ్రామ పంచాయితీ నుంచి రెండు లక్షల ముప్పైవేలు ఇస్తామని, ఈమేరకు పంచాయితీ తీర్మాణం ప్రతిని కుటుంబ సభ్యులకు ఎంపిడివో అందచేయటంతో ధర్నా విరమించారు.

## విద్యార్థులను క్రమం తప్పకుండా బడికి పంపాలి

### -ఎంఈఓ నీలకంఠం


మాట్లాడుతున్న ఎంఈఓ నీలకంఠం

**పాపన్నపేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** విద్యార్థులు క్రమం తప్పకుండా పాఠశాలకు హాజరయ్యేలా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉంటుందని ఎంఈఓ నీలకంఠం సూచించారు. శనివారం మండల పరిధిలోని కొత్తపల్లి, లింగాయపల్లి, చీకోడ్ గ్రామాల్లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో పోషకుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా పాఠశాలల్లో కొనసాగిన సమావేశాల్లో ఎంఈఓ పాల్గొని పోషకులకు పలు సూచనలు చేశారు. తమ చిన్నారులు పాఠశాల నుంచి ఇంటికి వచ్చాక పాఠశాలలో చెప్పిన హోంవర్కు పూర్తి చేసుకునేలా, ఆ రోజు చెప్పిన పాఠంను చదువుకునే ప్రత్యేక చొరవ తీసుకోవాలన్నారు. విద్యార్థుల ప్రగతిని ఉపాధ్యాయులు తల్లిదండ్రులకు వివరించారు. ఆయా సమావేశాల్లో కాంప్లెక్స్ ప్రధానోపాధ్యాయులు సురేందర్‌గౌడ్, ప్రధానోపాధ్యాయులు రామ్‌రెడ్డి, ఉపాధ్యాయులు సోమశేఖర్, దత్తురెడ్డి, శివకుమార్, నాగభూషణం, వేణు, స్వర్ణ, ప్రసాద్‌రెడ్డి, తులసీరామ్, సిఆర్‌పి మహేశ్వరి, పోషకులు పాల్గొన్నారు.

## మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేత

**కొల్చారం, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** మండల పరిధిలోని పోతంశెట్టిపల్లి వడ్డెర కాలనీకి చెందిన ముద్దంగుల దుర్గమ్మ శుక్రవారం రోడ్డు ప్రమాదంలో మృతి చెందింది. మృతురాలి కుటుంబానికి ఆర్థిక సహాయంగా రూ. 5 వేల గౌడ సంఘం మండల అధ్యక్షుడు, మాజీ సర్పంచి నాయిని సునితా వెంకట్ గౌడ్ అందజేశారు. కార్యక్రమంలో మాజీ సర్పంచి గడ్డమీద నర్సింలు, మాజీ సర్పంచి కొమ్ముల యాదాగౌడ్, మాజీ సర్పంచి చిట్యాల యాదయ్య, మాజీ ఎంపీటీసీ సాయిని సిద్ధిరాములు, కొమ్ముల రాజాగౌడ్ పాల్గొన్నారు.

## చెరువు కట్టపై బుంగ

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 21, ప్రభాతవార్త:** మండల పరిధి సూరారంలో శుక్రవారం కురిసిన భారీ వర్షానికి పెద్ద చెరువు కట్టపై బుంగ పడింది. బుంగవల్ల నీరు వృధాగాపోతున్నాయి. గ్రామస్తులు అధికారులకు సమాచారం ఇవ్వడంతో తహసీల్దార్ మన్నన్, ఎస్ఐ నారాయణగౌడ్‌లు చెరువుకట్ట వద్దకు వెళ్లి పరిశీలించారు. జేసిబితో చెరువు కట్టపై పడిన బుంగను పూడ్చి వేశారు.

## క్రమం తప్పకుండా పాఠశాలకు విద్యార్థులను పంపాలి

**చిన్నశంకరంపేట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త :** తల్లిదండ్రులు విద్యార్థులను ప్రతి రోజూ పాఠశాలకు పంపాలని జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు దీప్లా తెలిపారు. పాఠశాలలో విద్యార్థుల తల్లితండ్రులతో శనివారం సమావేశం నిర్వహించారు. విద్యార్థులు ఎలా చదువుతున్నారనే విషయాన్ని వారికి వివరించారు. వారు మాట్లాడుతూ చదువులో వెనకబడిన విద్యార్థుల పట్ల ప్రత్యేక శ్రద్ధ వహిస్తున్నట్లు తెలిపారు. పాఠశాల వందశాతం ఉత్తీర్ణత సాధించాలంటే తల్లితండ్రులు ఉపాధ్యాయులకు సహకరించాలని కోరారు. విద్యార్థులకు ఉన్నతమైన విద్య అందించేందుకు ప్రతి ఉపాధ్యాయుడు కృషి చేస్తున్నారని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి పోచయ్య తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీ కేంద్రంలో పోషణ సంబరాలు

**వర్గల్, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త):**

వర్గల్ మండలం నాచారం సెక్టార్ పరిధిలోని వేలూరు గ్రామంలోని అంగన్వాడీ కేంద్రంలో శనివారం పోషణ సంబరాలను నిర్వహించారు. ఈ సందర్భంగా బరువు తక్కువగా ఉన్న పిల్ల లకు, తల్లులకు ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత అవగాహన కల్పించారు. రోజు వారి ఆహారంలో భాగంగా పప్పుధాన్యాలను, కూరగాయలు, ఆకుకూరలు, చిరుధాన్యాలను తీసుకోవాలని తెలిపారు. మంచి ఆహారం తీసుకుంటేనే మంచి ఆరోగ్యం లభిస్తుందన్నారు. అనంతరం గర్భిణీలకు సామూహిక సీమంతాలు, చిన్నారులకు అన్నప్రాసన, అక్షరాభ్యాసం చేపించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మజ, అంగన్వాడీ టీచర్లు హరిత, నాగమణి, ఆశలు, అంగన్వాడీ ఆయాలు తదితరులు పాల్గొన్నారు.

## సిఎంఆర్‌ఎఫ్ చెక్కులు అందచేసిన ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** ఆరోగ్యశ్రీ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే డాక్టర్ పట్లోళ్ల సంజీవరెడ్డి అన్నారు. శనివారం ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నారాయణఖేడ్, మనూర్, నాగల్‌గిద్ద మండలాలకు చెందిన వారికి సిఎంఆర్‌ఎఫ్ చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజీవరెడ్డి మాట్లాడుతూ ఆసుపత్రుల్లో ఆరోగ్యశ్రీ సేవలు లేవంటే తన దృష్టికి తేవాలని ప్రజలకు సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పట్లోళ్ల సుధాకర్‌రెడ్డి, నాయకులు పండరిరెడ్డి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు తాహేర్, మాజీ ఎంపిటిసి, నాయకులు కిషన్‌సేట్, లింగారెడ్డి, శ్రీకాంత్‌రెడ్డి, నర్సింలు, మాణిక్‌రెడ్డి, కిషన్, శివరాజ్, సలావుద్దీన్, రఘుపతిరెడ్డి, మిస్కిన్, సిద్దరెడ్డి, సచిన్ పాటిల్, పండరినాథ్, శివరెడ్డి, హన్మంతు, శంకర్, సికిందర్‌రెడ్డి, అభిలేష్ రెడ్డి, శివయ్యస్వామి, శంకర్‌రెడ్డి, శాదుల్ చిస్తి తదితరులు పాల్గొన్నారు.

## సువర్ణ శెట్కార్‌ను పరామర్శించిన మాజీ ఎమ్మెల్యే

**నారాయణఖేడ్ టౌన్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** వ్యవసాయ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ సువర్ణశెట్కార్‌ను మాజీ ఎమ్మెల్యే మహారెడ్డి భూపాల్ రెడ్డి పరామర్శించారు. ఇటీవల సువర్ణశెట్కార్ అనారోగ్యానికి గురై ఆసుపత్రిలో చికిత్స అందుకుని ఇంట్లో విశ్రాంతి తీసుకుంటున్నట్లు తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి ఆమె నివాసానికి చేరుకుని ఆరోగ్య పరిస్థితిని తెలుసుకుని పరామర్శించారు. మాజీ ఎమ్మెల్యే వెంట మున్సిపల్ మాజీ చైర్మన్ నజీబ్, కౌన్సిలర్లు అభిషేక్ శెట్కార్, విఠల్, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు నగేష్ సేట్, కో-ఆప్షన్ సభ్యులు ఉబేద్, అల్లాపూర్ మాజీ సర్పంచ్ ఏక్‌నాథ్ తదితరులు పాల్గొన్నారు.

## ఎద్దుమైలారం జడ్పీహెచ్ఎస్‌లో స్వచ్ఛ్ హీ సేవా

**కంది, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఎద్దుమైలారం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో శనివారం స్వచ్ఛ్ హీ సేవా కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ఓడిఎఫ్ కర్మాగారం మేనేజర్లు విజయ్‌దత్, బాబ్జి, రాందాస్, అమిత్‌కుమార్, రవిసింగ్, చౌదరి, మోహన్, ఎంపిడిఓ శ్రీనివాస్, గ్రామ ప్రత్యేక అధికారి మహేందర్ రెడ్డి, ప్రధానోపాధ్యాయులు జోగప్ప, పంచాయతీకార్యదర్శి శ్రీనివాస్, మాజీ సర్పంచ్ మల్లారెడ్డి, మాజీ ఎంపిటిసి సభ్యులు శ్రీనివాస్, వరకుమార్, ఉపాధ్యాయులు పాల్గొని పాఠశాలతోపాటు గ్రామ పరిసరాలను పరిశుభ్రం చేశారు. మొక్కలు నాటి పర్యావరణ పరిరక్షణకు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గ్రామస్థులకు అవగాహన కల్పించారు. పాఠశాల అవసరాలను డిఎఫ్ కార్మాగారం మేనేజర్లు తెలుసుకుని వాటిని సమకూర్చేందుకు హామిచేశారు. ఇదిలా ఉండగా పాఠశాలలో ఎంపిడిఓ మధ్యాహ్న భోజనంచేసి ఆహారం నాణ్యతను పరిశీలించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు.

## బాధితుడికి ఫోన్ అందచేసిన ఎస్ఐ

**మనూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** పోగొట్టుకున్న సెల్ ఫోన్‌ను సిఈఐఆర్ పోర్టర్ ద్వార రికవరీ చేసి బాధితుడికి శనివారం ఎస్ఐ రాజశేఖర్ ఫోన్‌ను అందచేశారు. మండలంలోని రాణాపూర్ గ్రామానికి చెందిన మాలిపటేల్ శివాజీరావు ఇటీవల తన సెల్ ఫోన్‌ను పోగొట్టుకున్నాడు. బాధితుడు విషయాన్ని పోలీసు అధికారులకు తెలుపడంతో ఎస్ఐ రాజశేఖర్ సిఈఐఆర్ పోర్టల్ ద్వార సెల్ ఫోన్‌ను రికవరీ చేసి బాధితుడు మాలిపటేల్ శివాజీరావుకు పోలీసు ఠాణాలో అందచేశారు.

## ఖాజాపూర్‌లో ఉచిత వైద్య శిబిరం

**సిర్గాపూర్, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:** మండల పరిధిలోని ఖాజాపూర్ గ్రామంలో సీజనల్ వ్యాధుల బారినపడకుండా ముందస్తుగా శనివారం వైద్య శిబిరాన్ని నిర్వహించారు. వైద్య శిబిరానికి చేరుకున్న గ్రామస్థులకు డాక్టర్లు జ్వరం, జలుబు, దగ్గు తదితర వ్యాధిగ్రస్థులకు సిర్గాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం డాక్టర్ ప్రతిభ తన వైద్య సిబ్బందితో ప్రజలకు పరీక్షలు నిర్వహించి మందులను పంపిణి చేశారు. ఇంటి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రత్యేక చొరవ తీసుకోవాలని ప్రజలకు సూచించారు.

## నార్సింగి విద్యుత్ సబ్ స్టేషన్‌కు సెల్‌ఫోన్ బహూకరణ

**పాపన్నపేట, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:**

మండల పరిధిలోని నార్సింగి విద్యుత్ సబ్ స్టేషన్‌కు ఆర్కెల మాజీ ఎంపిటిసి సభ్యులు రాజు శనివారం సెల్‌ఫోన్‌ను బహుకరించారు. నితరం రాత్రిపగలు సేవలిందించే సబ్‌స్టేషన్‌లో ఉన్న కార్యాలయ సెల్ ఫోన్ చెడిపోవడంతో వినియోగదారులకు సమాచారం అందించేందుకు సమస్యలు పడుతున్నట్లు గ్రహించిన రాజు ఒక సెల్ ఫోన్‌ను అందించారు. వినియోగదారులు 9492079443కికాల్ చేసి తమ సమస్యలను, పరిష్కరించుకోవచ్చన్నారు. కార్యక్రమంలో ఆపరేటర్లు సద్దాం సురేందర్, బాబు నాయక్, అభిషేక్ తదితరులు ఉన్నారు.

## కొండ లక్ష్మణ్ బాపూజీకి ఘన నివాళులు

**శివ్వంపేట, సెప్టెంబర్ 21 (ప్రభాతవార్త) :** కొండలక్ష్మణ్ బాపూజీ వర్ధంతి సందర్భంగా శనివారం శివ్వంపేటలో మండల పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయన చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా పద్మశాలి సంఘం మండల అధ్యక్షులు బొడ్డు బిక్షపతి మాట్లాడుతూ కొండలక్ష్మణ్ బాపూజీ చూపిన బాటలో నడుస్తు ఆయన ఆశయలను కొనసాగిస్తామన్నారు. కొండలక్ష్మణ్ బాపూజీ సేవలు గురించి కొనియాడారు. ఈ కార్యక్రమంలో పద్మశాలి సంఘం సభ్యులు సిల్వేరి వీరేశ్, బొడ్డు పెద్ద నర్సింలు, గడ్డం రాజు, బొడ్డు చిన్న నర్సింలు భీమనపల్లి మురళి పాల్గొన్నారు.


లక్ష్మణ్‌బాపూజీ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న పద్మశాలి సంఘం సభ్యులు

## మహిళ అదృశ్యం

**శివ్వంపేట, సెప్టెంబర్ 21(ప్రభాతవార్త) :** మహిళ అదృశ్యమైన ఘటన శివ్వంపేట పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై మహిపాల్ రెడ్డి కథనం ప్రకారం... శివ్వంపేట గ్రామనికి చెందిన లస్కరి నాగమణి(50) ఈనెల 18న మతిస్థిమితం సరిగా లేనందున ఇంటి నుండి వెళ్లిపోయింది చుట్టుపక్కల తెలిసినవారిని అడిగినా ఆచూకీ లభించలేదు. భర్త ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై మహిపాల్‌రెడ్డి తెలిపారు.

## పెట్రోల్ పోసుకొని యువకుడి ఆత్మహత్యా యత్నం

**పెద్దశంకరంపేట, సెప్టెంబర్ 21 ప్రభాతవార్త:** కుటుంబ కలహాలతో ఓ వ్యక్తి ఒంటిపై పెట్రోల్ పోసుకొని ఆత్మహత్యా యత్నానికి ప్రయత్నించిన సంఘటన పెద్దశంకరంపేటలో శనివారం చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళితే పట్టణంలోని వడ్డెరవాడకు చెందిన ఎల్గోయి కుమార్(38) భార్యతో గొడవపడ్డాడు. ఈ క్రమంలో క్షనికావేశంలో తన కాలనీకి వెల్లే మార్గంలో ఒంటిపై పెట్రోల్ పోసుకొని నిప్పంటించుకున్నాడు. దీంతో అతడికి తీవ్రగాయాలు అయ్యాయి. విషయం తెలుసుకున్న ఎస్ఐ శంకర్ సంఘటన స్థలానికి చేరుకొని బాధితుడిని హైవే అంబులెన్స్‌లో జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి వివరాలు సేకరించారు. కాగా బాధితుడికి భార్యతోపాటు ఇద్దరు పిల్లలు ఉన్నారు.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

### -మరొకరికి తీవ్ర గాయాలు

**అల్లాదుర్గం, సెప్టెంబరు 21, ప్రభాతవార్త:**

రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి మృతి చెందగా మరో వ్యక్తి తీవ్ర గాయాలకు గురైన సంఘటన మండల పరిధిలోని ముప్పారం 161వ జాతీయ రహదారిపూ పై ఓవర్ వంతెన వద్ద చోటు చేసుకుంది. ఎస్ఐ ప్రవీణ్‌రెడ్డి కథనం ప్రకారం... శనివారం టేక్మాల్ మండలంకు చెందిన మహమ్మద్ కర్ (52) పెద్ద శంకరం పేట నుంచి ద్విచక్ర వాహనంపై (టిజి 35 0190)పై మహమ్మద్ కమర్, అరవిందలు కలిసి టేక్మాల్ వస్తున్న క్రమంలో మార్గమధ్యలో అల్లాదుర్గం మండలం ముప్పారం వంతెన వద్ద ముందుగా వెళుతున్న ఆటోని డీకొట్టారన్నారు. ప్రమాదానికి గురైన క్షతగాత్రులను జోగిపేట ప్రభుత్వ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ కమర్ మృతి చెందాడన్నారు. మరో వ్యక్తి అరవింద్‌కు తీవ్ర గాయాలైనట్లు ఎస్ఐ పేర్కొన్నారు. మృతుడి భార్య ఫరీనా బేగం ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.